www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -210 మంగళవారం17 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

ఎన్నికల్లో రిజర్వేషన్ల అధికారం రాష్ట్రాలదే

రిజర్వేషన్ల రొటేషన్ విధానంపై సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, నవంబర్ 16(ప్రజావినికిడి):

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపుపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఏయే స్థానాలకు ఏ రిజర్వేషన్ వర్తింపజేయాలన్న దానిపై అధికారం పూర్తిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని పేర్కొంది. తమ నియోజకవర్గాన్ని రిజర్వుడ్‌గా నిర్ణయించాలని కోరే హక్కు ఎవరికీ ఉండదని స్పష్టం చేసింది. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి నూతన రొటేషన్ విధానాన్ని అమలు చేస్తుండడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది. రూపాలీ ఇంద్రభూషణ్ సోండే అనే వ్యక్తి.. బాంబే హైకోర్టులోని **మిగతా 2లో...**

విజయవాడలో రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం..

ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా

చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ఘన స్వాగతం

తొమ్మిది రంగాల్లో విశిష్ట వ్యక్తులకు పురస్కారాలు

అవార్డు గ్రహీతలకు పది లక్షల నగదు బహుమతి



విజయవాడ నవంబర్ 16 (ప్రజావినికిడి):

విజయవాడ నగరంలో రామోజీ ఎక్సలెన్స్ అవార్డులు - 2026 ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమైంది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్**మిగతా 2లో...**

ఫిలిప్పీన్స్‌లో మోదీ పర్యటన

ఆసియాన్, తూర్పు ఆసియా సదస్సుల్లో పాల్గొన్న ప్రధాని..

వాణిజ్యం, సముద్ర భద్రతపై కీలక చర్చలు



మనిలా: నవంబర్ 16 (ప్రజావినికిడి):

భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫిలిప్పీన్స్ పర్యటనలో భాగంగా మనిలాలో జరుగుతున్న 23వ ఆసియాన్‌భారత్ సదస్సు, 21వ తూర్పు ఆసియా సదస్సుల్లో పాల్గొంటున్నారు. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ ఆహ్వానం మేరకు నవంబర్ 16 నుంచి 17 వరకు ఆయన ఈ పర్యటన చేపట్టారు.**మిగతా 2లో...**

ఐసీసీ చైర్మన్ పీఠంపై మరోసారి జై షా..

బాలిలో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో కీలక నిర్ణయం

జై షా నియామకంపై హర్షం వ్యక్తం చేసిన మంత్రి నారా లోకేశ్



2లో.

ఇరిగేషన్ పై ఫోకస్

సమ్మక్కసాగర్‌కు ఎన్‌వోసీ కోసం నేడు ఛత్తీస్‌గఢ్‌కు ముఖ్యమంత్రి

మంత్రి ఉత్తమ్‌తో కలిసి ఆ రాష్ట్ర సీఎంతో భేటీ

ఇప్పటికే నయా రాయ్‌పూర్‌కు అధికారులు

ఛత్తీస్‌గఢ్ ఎన్‌వోసీ ఇస్తే సీడబ్ల్యూసీ

అనుమతుల కోసం మరోసారి డీపీఆర్ దాఖలు

హైదరాబాద్, నవంబర్ 16 (ప్రజావినికిడి):

: సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) సాధించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. ఇందుకోసం ఆయన ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లనున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న సీఎం మంగళవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి నయా రాయ్‌పూర్‌కు వెళ్లి.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్‌తో సమావేశం కానున్నారు. వాస్తవానికి సమ్మక్కసాగర్ ప్రాజెక్టు డీపీఆర్‌కు సీడబ్ల్యూసీలోని అంతరాష్ట్ర విభాగం మినహా.. అన్ని డైరెక్టరేట్లు ఇప్పటికే క్లియరెన్సులు ఇచ్చాయి.

కేవలం ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ తెచ్చుకుంటే ఈ ప్రాజెక్టుకు క్లియరెన్స్ ఇస్తామని సీడబ్ల్యూసీ ఇదివరకే తేల్చిచెప్పింది. దాంతో 2023 డిసెంబరులో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత సమ్మక్కసాగర్ ప్రాజెక్టు అనుమతులపై దృష్టి పెట్టింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఓసారి స్వయంగా ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి ఆ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్‌ను కలుసుకొని చర్చించారు. ఆ తర్వాత రెండుసార్లు హైదరాబాద్, న్యూఢిల్లీలో కూడా ఛత్తీస్‌గఢ్ సీఎంతో చర్చలు



జరిపారు. ఈ క్రమంలోనే ముంపుపై అధ్యయనానికి నిధులను కూడా ప్రభుత్వం సమకూర్చింది. ఆ అధ్యయన నివేదిక వచ్చాక.. ముంపు ఏ మేరకు ఉంటుందనే దానిపై అంచ నాలు రూపొందించి భూములకు గరిష్ఠ పరిహారం చెల్లిస్తామని ఛత్తీస్‌గఢ్‌కు హామీ ఇచ్చింది. మరోవైపు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్,ఉత్తమ్ పలుమార్లు **మిగతా 2లో...**

పాత పెన్షన్ కోసం పోరు..

17న సీపీఎస్ ఉద్యోగుల సామూహిక సెలవు

రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ధర్మ దీక్షలకు పిలుపు

కాంగ్రెస్ ఎన్నికల హామీని గుర్తు చేస్తూ ఉద్యోగుల ఆందోళన

2.15 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొనే అవకాశం



హైదరాబాద్, నవంబర్ 16 ((ప్రజావినికిడి):

పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలనే డిమాండ్‌తో తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరోసారి పోరుబాట పట్టారు. ఇందులో భాగంగా మంగళవారం (17న) రాష్ట్రవ్యాప్తంగా సామూహిక సెలవు పాటించనున్నట్లు తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీసీపీఎస్ఈయూ) ప్రకటించింది. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ 'ధర్మ దీక్షలు' చేపట్టనున్నట్లు తెలిపింది.

యూనియన్ అధ్యక్షుడు స్థితప్రజ్ఞ మాట్లాడుతూ, 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పెన్షన్ విధానంపై ఇచ్చిన హామీకి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ఆందోళన**మిగతా 2లో...**

ఓటుకు వెయ్యి, ఉచిత ప్రయాణం!..

హైదరాబాద్ వాసులకు ఏపీ పంచాయతీ నేతల ఆఫర్లు?

ఏపీ పంచాయతీ ఎన్నికల వేళ హైదరాబాద్ ఓటర్లపై అభ్యర్థుల దృష్టి

కూకట్‌పల్లి, అమీర్‌పేట వంటి ప్రాంతాల్లో ఓటర్లతో నేతల సమావేశాలు

పోలింగ్ తేదీల్లో ఏపీకి ప్రయాణ టికెట్ల ధరలను పెంచిన ట్రావెల్ ఏజెన్సీలు

ఓటర్లను ఆకట్టుకునేందుకు కార్తీక మాస వనభోజనాల ఏర్పాటు



అమరావతి హైదరాబాద్ నవంబర్ 16 (ప్రజావినికిడి):

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల వేడి తారస్థాయికి చేరుకుంది. స్థానిక పోరులో గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు.. ఇప్పుడు హైదరాబాద్‌లో స్థిరపడిన**మిగతా 2లో...**



ఈసీని ప్రశ్నిస్తాం



ఓటర్ల జాబితా సవరణపై 48 ప్రశ్నలు..

అనుమతించాలని సుప్రీంకోర్టును కోరిన ఇండియా బ్లాక్


న్యూఢిల్లీ, నవంబర్ 16(ప్రజావినికిడి):

దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీఐ) ప్రశ్నించేందుకు అనుమతించాలని కోరుతూ ఇండియా బ్లాక్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు 48 ప్రశ్నలతో కూడిన పిటిషన్‌ను దాఖలు చేశారు.**మిగతా 2లో...**



17 ఏళ్లుగా జైల్లో ఉన్నారు.. బెయిల్ ఇస్తున్నాం!

బిల్కిస్‌బానో కేసులో దోషుల పిటిషన్‌పై సుప్రీంకోర్టు సంచలన ఉత్తర్వులు



నా వైపు నుంచి కథ ఏమిటో చెప్పా

'బిలాంగింగ్' ఆత్మకథ ఆవిష్కరణలో సోనియా

అమ్మ నాలుగు సార్లు క్యాన్సర్‌ను జయించింది

నాన్న మరణంతో అమ్మ ముభావంగా మారింది

చిన్ననాటి జ్ఞాపకాలతో రాహుల్‌గాంధీ ఉద్వేగం

కార్యక్రమానికి హాజరైన సీఎంలు రేవంత్, డీకే

న్యూఢిల్లీ, నవంబర్ 16 (ప్రజావినికిడి):

తన కుటుంబంపై ఏళ్ల తరబడి తప్పుడు ప్రచారం జరిగిందని, చివరకు తాను మాట్లాడాలనుకున్నానని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అన్నారు**మిగతా 2లో...**

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

ఈసీని ప్రశ్నిస్తాం

మొదటిపేజీ తరువాయి

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు పలు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు ఈ పిటిషన్‌లో పిటిషనర్లుగా ఉన్నారు.ఎస్ఐఆర్‌కు సంబంధించి తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా జరిగాయని ఎన్నికల సంఘం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొంది. అయితే ఈ అఫిడవిట్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి నిజంగా ఆమోదించారా? అనే విషయంపై ఇండియా బ్లాక్ నేతలు ప్రశ్నలు సంధించారు. ఆమోదం ఏ తేదీన, ఏ సమావేశంలో లేదా ఫైల్ సర్క్యులేషన్ ద్వారా ఇచ్చారో వెల్లడించాలని కోరారు.ఎస్ఐఆర్, ఈసీఐనెట్, ఫారం-6, అప్పీళ్ల దాఖలు వంటి అంశాల్లో ఎన్నికల కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నాయా? ఉంటే ఎన్ని సందర్భాల్లో లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారు? ఏ నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నారు? మరికొన్ని నిర్ణయాలు మెజారిటీ ఆధారంగా జరిగాయా? అనే వివరాలను కోరారు. 2025 ఫిబ్రవరి 19 నుంచి 2026 అక్టోబర్ 26 వరకు జరిగిన పరిణామాలకు సంబంధించిన రికార్డులను సమర్పించాలని పిటిషనర్లు కోరారు.కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఆన్‌లైన్ ఫారం-6లో అదనపు డిక్లరేషన్‌ను ఎవరు ప్రవేశపెట్టారు? ఎప్పుడు అమల్లోకి తీసుకొచ్చారు? ఎన్నికల సంఘం అధికారికంగా ఆమోదించిందా? అనే ప్రశ్నలను లేవనెత్తారు. ఈ నిబంధనల కారణంగా ఎన్ని దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని ప్రాసెస్ చేయకుండా నిలిచిపోయాయి అనే గణాంకాలను వెల్లడించాలని కోరారు.ఎస్ఐఆర్ సందర్భంగా ముసాయిదా, తుది ఓటర్ల జాబితాల నుంచి తొలగించిన పేర్లకు సంబంధించిన రాష్ట్రాల వారీ గణాంకాలను వెల్లడించాలని ఇండియా బ్లాక్ నేతలు కోరారు. మరణం, వలస, గైర్హాజరు, డూప్లికేషన్ వంటి కారణాలతో తొలగించిన ఓటర్ల వివరాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఫారం-7 ద్వారా వచ్చిన అభ్యంతరాలు, వాటిలో తప్పుడు ఫిర్యాదుల సంఖ్య, బాధ్యులపై తీసుకున్న చర్యల వివరాలనూ అడిగారు.అలాగే ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) ఆదేశాలు లేకుండానే ఓటర్ల జాబితాలో పేర్లను చేర్చడం, తొలగించడం లేదా మార్పులు చేయడం జరిగిందా? ఒకసారి తొలగించిన ఓటరు పేరును తిరిగి చేర్చే అధికారం ఈసీఐనెట్‌లో అధికారులకు ఉందా? అనే అంశాలపై స్పష్టత కోరారు.ఈ పిటిషన్‌లో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ నేత సౌగతా రాయ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ ప్రసాద్ యాదవ్, సంజయ్ రౌత్, ఎంఏ బేబీ, డి.రాజా, మహువా మాఝీ, సుప్రియా సూలే, ఈటీ మహమ్మద్ బషీర్ తదితరులు ఉన్నారు.ఎన్నికల సంఘం నిర్ణయాల వెనుక ఉన్న ప్రక్రియ, ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై సమాధానాలు రాబట్టడమే ఈ పిటిషన్ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఈ అంశంపై సుప్రీంకోర్టు నవంబర్ 17న విచారణ చేపట్టనుంది.

విజయవాడలో రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం..

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఒకే వేదికపై కేంద్ర హోంమంత్రితో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పాల్గొనడంతో సభా ప్రాంగణం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది.విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదిక వేదికగా జరుగుతున్న ఈ సభకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేరుకోగా.. రామోజీ గ్రూప్ సీఎండీ సి.హెచ్. కిరణ్ వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు చంద్రబాబు, పవన్ కల్యాణ్, సి.హెచ్. కిరణ్ సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా విచ్చేసి విశిష్ట వ్యక్తులకు పురస్కారాలు అందించే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అమిత్ షాకు గవర్నర్ అబ్దుల్



నజీర్, సీఎం చంద్రబాబు స్వాగతం పలికారు.

ఈనాడు సంస్థల వ్యవస్థాపకులు దివంగత రామోజీరావు సమాజానికి అందించిన సేవలను స్మరిస్తూ, ఆయన జయంతి రోజైన నవంబర్ 16న రామోజీ గ్రూప్ ఈ ఎక్సలెన్స్ అవార్డులను ఏటా ప్రదానం చేస్తోంది. సమాజ హితం కోసం, ప్రజా ప్రయోజనాల కోసం వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులను గుర్తించి గౌరవించడమే ఈ పురస్కారాల ముఖ్య ఉద్దేశం. గతేడాది రామోజీ ఫిల్మ్‌సిటీలో తొలి విడత అవార్డుల ప్రదానోత్సవం జరగ్గా.. ఇప్పుడు రెండో ఎడిషన్ కార్యక్రమాన్ని విజయవాడలో నిర్వహిస్తున్నారు.

గతేడాది 7 విభాగాల్లో పురస్కారాలు ఇవ్వగా, ఈ ఏడాది ఆ సంఖ్యను 9కి పెంచారు. జర్నలిజం, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, మహిళా సాధికారత, కళలు-సంస్కృతి, గ్రామీణాభివృద్ధి-వ్యవసాయం, యూత్ ఐకాన్ విభాగాలతో పాటు.. కొత్తగా విద్య, వైద్య-ఆరోగ్య రంగాలను కూడా చేర్చారు. దేశవ్యాప్తంగా వచ్చిన వందలాది నామినేషన్లను సమగ్రంగా పరిశీలించిన అనంతరం నిపుణుల కమిటీ తుది జాబితాను ఖరారు చేసింది. ఎంపికైన 9 మంది పురస్కార గ్రహీతలకు ప్రశంసా పత్రం, ప్రత్యేక జ్ఞాపికతో పాటు రూ.10 లక్షల చొప్పున నగదు బహుమతిని అతిథుల చేతుల మీదుగా అందజేస్తున్నారు

నా వైపు నుంచి కథ ఏమిటో చెప్పా

మొదటిపేజీ తరువాయి

అందుకే తన భావాలను పుస్తక రూపంలో తీసుకొచ్చానని చెప్పారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో ఆమె రాసిన ఆత్మకథను సోమవారం ఢిల్లీలోని ఐటీసీ హోటల్‌లో అధికారికంగా ఆవిష్కరించారు. ఈ పుస్తకం ఈ నెల 10నే మార్కెట్‌లోకి వచ్చింది. ప్రచురణ సంస్థ హార్పర్ కాలిన్స్ ఇండియా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాహుల్, ప్రియాంక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత సోనియా పుస్తకం గురించి మాట్లాడారు. 'నా అత్తగారు ఇందిరాగాంధీ, నా భర్త, కొడుకు రాహుల్, కూతురు ప్రియాంక.. ఇలా మా కుటుంబం అందరి మీదా ఎన్నో ఏళ్లుగా తప్పుడు ప్రచారం చేశారు. మనసును గాయపరిచే మాటలు అన్నారు. నా వైపు నుంచి కథ ఏమిటో చెప్పాలంటే పుస్తకం రాయడమే సరైందని అనిపించింది' అని సోనియా చెప్పారు. పుస్తకానికి వస్తున్న ఆదరణ ఎంతో సంతోషం కలిగించిందన్నారు.

తన పిల్లలు రాహుల్, ప్రియాంక, స్నేహితురాలు మంజూలికా దూబే పట్టుబట్టడం వల్లే ఈ పుస్తకం రాశానని తెలిపారు. తనకు డైరీ రాసే అలవాటు లేదని, జీవితంలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకుని రాశానని చెప్పారు. మొదట్లో రాయడం కష్టంగా అనిపించినా, ఒకసారి మొదలుపెట్టాక ఆనకట్ట తెగినట్టు జ్ఞాపకాలన్నీ బయటకు వచ్చాయని అన్నారు. అత్త ఇందిరాగాంధీ హత్య, భర్త రాజీవ్‌గాంధీ హత్యల గురించి రాసేటప్పుడు చాలా కష్టంగా అనిపించిందని చెప్పారు.

ఇటలీ నుంచి వచ్చి కొత్త సంస్కృతిలో, కొత్త కుటుంబంలో కలిసిపోవడానికి తాను పడిన కష్టమే ఈ పుస్తకమని సోనియా చెప్పారు. ఈ దేశానికి చెందినదాన్నిగా మారిన అనుభవాన్ని చెప్పడానికే 'బిలాంగింగ్' అనే పేరు పెట్టానన్నారు. పెళ్లయి అత్తారింటికి చేరే చాలామంది అమ్మాయిలకు ఎదురయ్యే అనుభవమే తనకూ ఎదురైందని చెప్పారు. అందరు కోడళ్లలాగే తానూ కొత్త వాతావరణానికి, కొత్త పద్ధతులకు అలవాటు పడ్డానన్నారు. ఇందిరాగాంధీ అంటే మొదట్లో తనకు



ఎంతో భయంగా ఉండేదని, ఆమెను 'మమ్మీ' అని పిలవడానికి కొంత సమయం పట్టిందని సోనియా చెప్పారు. రాహుల్, ప్రియాంక పుట్టాక ఇందిరలో ఎంతో మార్పు వచ్చిందని తెలిపారు. ఆమె ఎంత బిజీగా ఉన్నా డైనింగ్ టేబుల్ దగ్గర అందరం కలుసుకుని మాట్లాడుకునే వాళ్లమని గుర్తుచేసుకున్నారు.

పుస్తకావిష్కరణలో రాహుల్‌గాంధీ తన తల్లిదండ్రుల గురించి చెప్పిన సంగతులు సభికులను ఒకసారి నవ్వించాయి, మరోసారి కంటతడి పెట్టించాయి. సోనియా, రాజీవ్ తొలిసారి కలుసుకున్న కేంబ్రిడ్జ్‌లోని వర్సిటీ రెస్టారెంట్‌కు చాలా ఏళ్ల తర్వాత తన గర్ల్‌ఫ్రెండ్‌తో వెళ్లానని రాహుల్ చెప్పారు. తన తల్లిదండ్రులు అక్కడే కలిశారని చెబితే, అక్కడి వ్యక్తి 'వాళ్లిద్దరూ నాకు బాగా తెలుసు' అన్నాడని తెలిపారు. అతను చెప్పిన 'చికెన్ షాసర్' ఆర్డర్ చేశామని అన్నారు. 'ప్రేమలో పడాలంటే వర్సిటీ రెస్టారెంట్‌కు వెళ్లండి. కానీ అక్కడ చికెన్ షాసర్ మాత్రం తినకండి. అక్కడ భోజనం బ్రహ్మాండంగా ఉండేదని వీళ్లకు గుర్తుంది. కానీ దారుణంగా ఉంది' అనడంతో సభలో నవ్వులు విరిశాయి. ఇంట్లో భోజనం చేసేటప్పుడు నాన్న తన ఒడిలో అమ్మను కూర్చోబెట్టుకునే వారని రాహుల్ చెప్పారు. అన్ని ఇళ్లలో అలాగే ఉంటుందని అనుకునే వాడినని, స్నేహితుల ఇంట్లో అలా లేకపోవడం చూసి ఆశ్చర్యపోయే వాడినని అన్నారు. తల్లిదండ్రులు గొడవ పడటం తాను ఒక్కసారే చూశానని చెప్పారు. నాన్న ఫోన్‌లో అమరీందర్‌సింగ్‌తో మాట్లాడుతూ అమ్మ పిలుపును పట్టించుకోనప్పుడే ఆ గొడవ జరిగిందని, సభలో ఉన్న అమరీందర్ వైపు చూపిస్తూ గుర్తు చేశారు. "ఒక అందమైన జీవితాన్ని చూస్తూ పెరిగాం. ఆ తర్వాత ఒక్కసారిగా అంతా ముక్కలై పోయింది. మా ఆధారాల్లో ఒకరిని తుపాకీతో కాల్చిచంపారు. మా అతిపెద్ద ఆధారం బాంబు దాడిలో ముక్కలైపోయారు" అని రాహుల్ ఆవేదనగా చెప్పారు. అమ్మ నాలుగు సార్లు క్యాన్సర్‌ను జయించారని, కానీ దాన్ని ఆమె ఎప్పుడూ పెద్దగా చెప్పుకోరని రాహుల్ వెల్లడించారు. "నా జీవితంలో ఒక్కసారి కూడా ఆమె భయపడటం గానీ, వెనకడుగు వేయడం గానీ చూడలేదు. అమ్మా... నాన్న నిన్ను ఎంతో ప్రేమించారు. నిన్ను చూసి ఆయన ఎంత గర్వపడేవారో చెప్పలేను" అంటూ తల్లి వైపు తిరిగి ఉద్వేగంగా ప్రసంగం ముగించారు.

రాజీవ్‌తో ప్రేమ ఓ అద్భుతం

రాజీవ్‌తో తన ప్రేమ ఒక అద్భుతమని సోనియా అన్నారు. ఆయన రాజకీయాల్లోకి వెళ్లడాన్ని తాను వ్యతిరేకించానని, ఆ సమయంలో స్వార్థంగా ఆలోచించానేమోనని ఇప్పుడు అనిపిస్తోందని చెప్పారు. రాజీవ్ మరణం తన జీవితాన్ని అతలాకుతలం చేసిందన్నారు. ఆ తర్వాత తాను చిన్నపిల్లలా అయిపోయానని, రాహుల్, ప్రియాంకలే తనకు తల్లిదండ్రులుగా మారి కాపాడారని చెప్పారు.

ప్రతిపక్షాల బల ప్రదర్శన

సోనియా పుస్తకావిష్కరణ కార్యక్రమం ప్రతిపక్షాల బల ప్రదర్శనకు వేదికగా మారింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం శివకుమార్, హిమాచల్ సీఎం సుఖ్‌విందర్‌సింగ్ సుఖుతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్, తృణమూల్ నేత అభిషేక్ బెనర్జీ కూడా వచ్చారు. నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, జేఎంఎం నేత, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, తమిళనాడు సీఎం విజయ్ కూడా హాజరయ్యారు.

పాత పెన్షన్ కోసం పోరు..

మొదటిపేజీ తరువాయి

చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.60 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉండగా, అత్యవసర సేవల విభాగంలో పనిచేస్తున్న 45,000 మందికి మినహాయింపు ఇచ్చారు. మిగిలిన 2.15 లక్షల మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 1.50 లక్షల మందికి పైగా ఉద్యోగులు సామూహిక సెలవు కోసం దరఖాస్తు చేసుకున్నారని యూనియన్ వెల్లడించింది.

ఈ డిమాండ్‌పై యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వరీ శ్రీకాంత్ నేతృత్వంలోని బృందం ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాను కలిసి వినతిపత్రం సమర్పించింది. తమ జీతం నుంచి 11.5 శాతం సీపీఎస్‌కు జమ చేస్తున్నప్పటికీ, పదవీ విరమణ తర్వాత పెన్షన్, వైద్య భద్రతపై తీవ్ర అనిశ్చితి నెలకొందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల తరహాలో తక్షణమే చర్యలు తీసుకోవాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన హామీని నిలబెట్టుకోవాలని వారు కోరారు.

సీపీఎస్ ఉద్యోగుల సామూహిక సెలవుకు ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డితో పాటు పలు ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించాయి. నల్గొండలో జరిగే ధర్మ దీక్షలో శ్రీపాల్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ పిలుపునిచ్చింది. ఈ ఆందోళన కారణంగా నవంబర్ 17న అత్యవసరం కాని ప్రభుత్వ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది.

ఐసీసీ చైర్మన్ పీఠంపై మరోసారి జై షా..

నవంబర్ 16 (ప్రజావినికిడి):

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్‌గా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన జై షాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్ రంగంలో ఆయన సాధించిన విజయం యావత్ భారతదేశానికే ఎంతో గర్వకారణమని కొనియాడారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తన ఆనందాన్ని పంచుకున్నారు. "నా మిత్రుడు జై షా రెండో విడతగా ఐసీసీ చైర్మన్‌గా తిరిగి నియమితులు కావడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. ఆయన ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అనేది క్రికెట్ ప్రపంచంలో ఆయన సంపాదించుకున్న అపారమైన విశ్వసనీయతను స్పష్టం చేస్తోంది. ఇది భారతదేశానికి గర్వకారణమైన క్షణం. క్రికెట్ క్రీడను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడంలో ఆయన సంపూర్ణ విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని లోకేశ్ పేర్కొన్నారు.ఇండోనేషియాలోని బాలి వేదికగా నిర్వహించిన ఐసీసీ బోర్డు సమావేశాల్లో సభ్యులంతా కలిసి జై షాను రెండోసారి చైర్మన్‌గా ఎన్నుకోవాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు.

17 ఏళ్లుగా జైల్లో ఉన్నారు.. బెయిల్ ఇస్తున్నాం!

బిల్కిస్‌బానో కేసులో దోషుల పిటిషన్‌పై సుప్రీంకోర్టు సంచలన ఉత్తర్వులు

నవంబర్ 16(ప్రజావినికిడి):

బిల్కిస్ బానో సామూహిక అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఇద్దరు దోషులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. దోషులైన బిపిన్‌చంద్ జోషి, ప్రదీప్ మోధియాలకు బెయిల్ మంజూరు చేస్తూ, వారి జీవిత ఖైదును సర్వోన్నత న్యాయస్థానం సస్పెండ్ చేసింది. ఇప్పటికే 17 ఏళ్లకు పైగా జైలు జీవితం గడపడం, వారి అప్పీల్‌లో వాస్తవాలు, చట్టపరమైన అంశాలను పరిగణించాల్సి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు న్యాయస్థానం ఉత్తర్వుల్లో కోర్టు పేర్కొంది.తమ శిక్షపై 2017 మేలో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ జోషి, మోధియా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా దోషుల్లో ఒకరైన జోషి తీవ్ర వికలాంగుడనే విషయాన్ని కూడా ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది.అయితే, నేర తీవ్రత దృష్ట్యా దోషులకు బెయిల్ ఇవ్వడాన్ని ప్రభుత్వ తరపు న్యాయవాది వ్యతిరేకించారు. దీనిపై దోషుల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రాథమిక ఎఫ్ఐఆర్‌లో ఒక దోషి పేరు లేదని, ఘటన జరిగిన మూడేళ్ల తర్వాత కేసులో ఇరికించారని తెలిపారు. బాధితురాలు కూడా పోలీసులకు లేదా వైద్య పరీక్షల సమయంలో వీరి పేర్లను చెప్పలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేవలం గుంపులో ఉన్నారనే ఆరోపణ తప్ప, వారు నేరుగా నేరానికి పాల్పడినట్లు ఆధారాలు లేవని వాదించారు.ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ ఏడాది మార్చిలోనే నోటీసులు జారీ చేసింది. కాగా, 2024 జనవరిలో 11 మంది దోషుల ముందస్తు విడుదలను సుప్రీంకోర్టు రద్దు చేసిన విషయం తెలిసిందే. తాజా బెయిల్ పొందిన ఈ ఇద్దరు కూడా ఆ 11 మందిలో ఉన్నారు.

ఎన్నికల్లో రిజర్వేషన్ల అధికారం రాష్ట్రాలదే

మొదటిపేజీ తరువాయి

నాగ్‌పూర్ బెంచ్ 2025 సెప్టెంబరులో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఈ పిటిషన్ దాఖలు చేశారు. గతంలో ఉన్న రిజర్వేషన్ క్రమాన్ని పక్కన పెట్టి కొత్త రొటేషన్ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల తదుపరి రిజర్వేషన్ పొందాల్సిన నియోజకవర్గాలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు.

ఫిలిప్పీన్స్‌లో మోదీ పర్యటన

మొదటిపేజీ తరువాయి

ఆసియాన్ దేశాలతో భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం.నవంబర్ 16న మనిలా చేరుకున్న మోదీకి అక్కడి అధికారులు, భారతీయ ప్రవాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ నిర్వహించిన ప్రత్యేక విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఉన్న సాంస్కృతిక సంబంధాలను ప్రతిబింబించే కార్యక్రమాలను వీక్షించారు. ఫిలిప్పీన్స్ సంప్రదాయ దుస్తులు ధరించి విందులో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ పర్యటనలో భారత్, ఆసియాన్ దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ సహకారం, డిజిటల్ సాంకేతికత, రవాణా అనుసంధానం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయి. ముఖ్యంగా సముద్ర భద్రత, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడంపై నేతలు దృష్టి సారించనున్నారు.

ఓటుకు వెయ్యి, ఉచిత ప్రయాణం!..

మొదటిపేజీ తరువాయి

ఆంధ్రా ఓటర్లపై దృష్టి సారించాయి. ఓటు వేసేందుకు వారిని సొంత గ్రామాలకు రప్పించేందుకు నగదు, ఉచిత ప్రయాణం వంటి ప్రలోభాలను ఎరగా వేస్తూ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.

రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం, ఏపీలో పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరగనున్నాయి. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13,000 సర్పంచ్, 1.32 లక్షల వార్డు సభ్యుల స్థానాలకు ఈ ఎన్నికలు జరుగుతుండగా, మొత్తం 2.61 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తొలి విడత నామినేషన్ల గడువు నవంబర్ 17తో ముగియనుండటంతో ప్రచారం మరింత హోరాహోరీగా మారనుంది.

ఈ నేపథ్యంలో, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, అమీర్‌పేట, మియాపూర్, బేగంపేట వంటి ప్రాంతాల్లో ఆంధ్రా ఓటర్లు అధికంగా నివసించే చోట్ల అభ్యర్థులు, వారి అనుచరులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఓటర్ల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, పోలింగ్ రోజున తప్పనిసరిగా గ్రామానికి వచ్చి ఓటు వేయాలని కోరుతున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ సర్పంచ్ అభ్యర్థి, తన గ్రామానికి చెందిన ఓటర్లకు ఓటుకు రూ.1,000 చొప్పున (ఒక కుటుంబంలో ఐదు ఓట్లు ఉంటే రూ.5,000), ప్రయాణ ఖర్చులు అదనంగా ఇస్తానని ఆఫర్ చేసినట్లు సమాచారం.

ఇరిగేషన్ పై ఫోకస్

మొదటిపేజీ తరువాయి

సమావేశమై వినతిపత్రాలు సమర్పించారు. తాజాగా ఈ ప్రాజెక్టు విషయంలో సీఎం రేవంత్ రంగంలోకి దిగారు.సమ్మక్కసాగర్ బ్యారేజీతో ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకునే ముంపుపై ఆ రాష్ట్ర ప్రభుత్వం ఖరగ్‌పూర్ ఐఐటీతో అధ్యయనం చేయించగా.. బ్యారేజీ వద్ద 87 మీటర్ల గరిష్ఠ వరదతో 100 ఎకరాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని తేలింది. బ్యారేజీ పూర్తిస్థాయి నీటినిల్వ 83 మీటర్లు కాగా... అక్కడిదాకా ముంపునకు గురయ్యే భూములకే పరిహారం చెల్లిస్తామని తెలంగాణ ప్రభుత్వం ఇదివరకే తేల్చిచెప్పింది. అయితే గరిష్ఠ వరద 2022 జూలై 17, 19వ తేదీల్లో 88 మీటర్ల దాకా రికార్డయిందని, ఆ మేరకు ముంపునకు గురయ్యే భూములకు కూడా పరిహారం చెల్లించాలని ఛత్తీస్‌గఢ్ పట్టుబట్టింది. తాజాగా ఐఐటీ-ఖరగ్‌పూర్‌తో చేయించిన అధ్యయనంతో ముంపు 100 ఎకరాలుగా స్పష్టత వచ్చింది. తెలంగాణ విజ్ఞప్తితో ఛత్తీస్‌గఢ్ అధికారులు బ్యారేజీని 2023 సెప్టెంబరు 6-9వ తేదీల్లో పరిశీలించారు. ఆ తర్వాత సర్వే చేసి, ముంపునకు గురయ్యే ప్రాంతాలను సత్వరం గుర్తించి, భూసేకరణ ప్రక్రియను వేగిరం చేయాలని ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌ను తెలంగాణ అధికారులు కోరారు.

రూ.9,257 కోట్లతో చేపట్టిన తుపాకులగూడెం బ్యారేజీలో 95 శాతం మేర పనులు కూడా పూరయ్యాయి. ఈ బ్యారేజీలో నీటిని నిల్వ చేసి.. బ్యాక్‌వాటర్‌ను దేవాదుల ఎత్తిపోతల పథకం కింద ఎత్తిపోయడం ద్వారా పూర్వ ఖమ్మం, న ల్లగొండ, వరంగల్ జిల్లాలకు నీరందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. అయి తే గత ప్రభుత్వంలో రాజకీయంగా ఎన్‌వోసీ కోసం ప్రయత్నించిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఈ ప్రయత్నాలు జరిగాయి. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగుతుండటంతో ప్రాజెక్టు ఎన్‌వోసీపై సానుకూల సంకేతాలు వస్తున్నాయి. మరోవైపు నీటిపారుదల శాఖ అధికారుల బృందం ఇప్పటికే నయా రాయ్‌పూర్‌కు చేరుకుంది. కాగా, 2011లో 10 శాతం కమాండ్ ఏరియాను మాత్రమే ధ్రువీకరించి, ఈ ప్రాజె క్టు డీపీఆర్‌ను దాఖలు చేశారు. నీటిపారుదల శాఖ సమర్పించిన సీడీవో (సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్) సర్టిఫికెట్‌పై సీడబ్ల్యూసీ తాజాగా అభ్యంతరం తెలుపుతూ డీపీఆర్‌ను ఇటీవలే వెనక్కి పంపించింది. వాస్తవానికి ఈ ప్రాజెక్టులో కీలకమైన ఆయకట్టు స్థిరీకరణపై సీడబ్ల్యూసీ చాలా రోజులుగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం ఆయకట్టుపై పూర్తి స్పష్టత రావడంతో ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ తెచ్చుకొని.. మళ్లీ డీపీఆర్ దాఖలు చేయనుంది.

విశ్వేశ్వరయ్య కాలనీలో పార్క్ ని ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి





ఎల్బీనగర్,(ప్రజావినికిడి):
ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్-1, విశ్వేశ్వరయ్య కాలనీలకు సంయుక్తంగా దాదాపు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన సుందరమైన పార్కును ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, సుమారు పది సంవత్సరాల క్రితమే ఈ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ, కొందరు వ్యక్తులు ఈ స్థలంలో పార్కు నిర్మించకూడదంటూ కోర్టును ఆశ్రయించి కేసు వేయడంతో పనులు కొంతకాలం నిలిచిపోయాయని తెలిపారు.
అయినప్పటికీ పట్టువదలని విక్రమార్కుడిలా ఈ స్థలంలో పార్కును నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ముందుకు సాగామని చెప్పారు. చివరకు అన్ని న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి, స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేలా అత్యంత సుందరమైన పార్కును నిర్మించడం జరిగిందని పేర్కొన్నారు.
అభివృద్ధి పనులను కొంతకాలం మాత్రమే అడ్డుకోగలరు.
కానీ చివరకు న్యాయమే గెలుస్తుంది అని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు.ప్రజల అవసరాలే లక్ష్యంగా ఎలాంటి అడ్డంకులు ఎదురైనా అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో హస్తినాపురం మాజీ కార్పొరేటర్ పద్మ శ్రీనివాస్ నాయక్,డివిజన్ అధ్యక్షులు సత్యం చారి, నాగిరెడ్డి కాలనీవాసులు భూపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, యాదగిరి, కరుణాకర్, ప్రతాప్,ప్రసాద్ రెడ్డి,ప్రవీణ్ రెడ్డి, అమర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వాచ్‌మెన్ మృతి



నాగోల్,(ప్రజావినికిడి):
గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.
పోలీసుల వివరాల ప్రకారం.. తట్టిఅన్నారం రాఘవేంద్ర కాలనీకి చెందిన గట్టిగుండ్ల లెవిన్ (32) ఫిర్యాదు మేరకు,అతని తండ్రి గట్టిగుండ్ల సైదులు (60) వృత్తిరీత్యా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. నాగోల్‌లోని జివిఆర్ కాలనీలో నివాసముంటున్న సైదులు ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి సుమారు 12:45 గంటల సమయంలో తన హోండా షైన్ ఎస్పీ మోటార్ సైకిల్‌పై బండ్లగూడ బస్ డిపో రోడ్డు మీదుగా జివిఆర్ కాలనీ వైపు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో సైదులు కిందపడటంతో కుడి కంటికి తీవ్ర గాయమై,ఎడమ కాలుకు ఫ్రాక్చర్ అయింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ ద్వారా అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు ఉదయం 11:56 గంటలకు మృతి చెందాడు.ఈ ఘటనపై మృతుడి కుమారుడు గట్టిగుండ్ల లెవిన్ నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం ఆచూకీ కోసం పోలీసులు విచారణ చేపట్టారు

నాగోల్ చెరువులో ఘనంగా ఛట్ పూజ వేడుకలు





నాగోల్,(ప్రజావినికిడి):
సోమవారం రోజు నాగోల్ చెరువు వద్ద బీహార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛట్ పూజ సమితి ఆధ్వర్యంలో ఛట్ పూజ వేడుకలను భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది.
ఈ పూజా కార్యక్రమంలో చింతల సురేందర్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛట్ పూజ ప్రాముఖ్యతను, సూర్య భగవానుడి ఆరాధన విశిష్టతను తెలియజేస్తూ భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో బీహార్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ మౌర్య, అసోసియేషన్ సభ్యులు,ఛట్ పూజ సమితి సభ్యులు, బీహార్‌కు చెందిన ప్రజలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిప్రపత్తులతో బీహార్ సాంప్రదాయాల ప్రకారంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు.
నాగోల్ చెరువు వద్ద పండుగ వాతావరణం నెలకొనగా, భక్తులందరూ కుటుంబ సభ్యులతో కలిసి సూర్య భగవానుడికి అర్ఘ్యం సమర్పించి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలు కలగాలని ప్రార్థించారు.

రంగారెడ్డి కలెక్టరేట్‌లో కాంటినెంటల్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం



రంగారెడ్డి,(ప్రజావినికిడి):ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించి, వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి సకాలంలో మెరుగైన వైద్య చికిత్స అందించాలనే లక్ష్యంతో సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు.
కాంటినెంటల్ హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించిన ఈ ఆరోగ్య శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం (EHS) లబ్ధిదారులతో పాటు సాధారణ ప్రజలు పాల్గొని వైద్య సేవలను పొందారు.ఈ సందర్భంగా కాంటినెంటల్ హాస్పిటల్స్‌కు చెందిన అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఆరోగ్య సలహాలు, సూచనలు అందించారు.ప్రజలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని,వ్యాధులను ముందస్తుగా గుర్తించడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఈ సందర్భంగా వైద్యులు సూచించారు.

ఒక్క మండలంలోనే దాదాపు వెయ్యి కొత్త చేయూత పింఛన్ల మంజూరు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





షాద్ నగర్,(ప్రజావినికిడి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద,మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ,ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.నియోజక వర్గంలోని అనారోగ్య బాధితుల వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) 23వ విడతలో 62 మంది లబ్ధిదారులకు రూ.25,07,500 నిధులు మంజూరైనట్లు వెల్లడించారు.సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు,అదేవిధంగా చేయూత పింఛన్లను పంపిణీ చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,మండలాల వారీగా షాద్‌నగర్ పట్టణంలో 10 మందికి రూ.6.44 లక్షలు,కేశంపేటలో 12 మందికి రూ.4.66 లక్షలు, ఫరూఖ్‌నగర్‌లో 15 మందికి రూ.4.57 లక్షలు,కొత్తూరులో 8 మందికి రూ.3.09 లక్షలు, జిల్లేడ్-చౌదరిగూడలో 6 మందికి రూ.2.17 లక్షలు, నందిగామలో 7 మందికి రూ.2.07 లక్షలు, కొందుర్గులో 4 మందికి రూ.2.06 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఊరటనిస్తోందన్నారు.అదేవిధంగా చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లుగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వికలాంగులు, వితంతువులు,ఒంటరి మహిళలు,గీత కార్మికులు, పద్మశాలీ వర్గాల వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారుఈ ఒక్క మండలంలోనే దాదాపు వెయ్యి కొత్త పింఛన్లు మంజూరు కావడం సంతోషకరమన్నారు.పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు,సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు,చేయూత పింఛన్ల ద్వారా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు.
ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని, తాను సైతం నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు,పనుల మంజూరు కోసం నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,సింగిల్ విండో చైర్మన్ చల్ల శ్రీకాంత్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్,వివిధ గ్రామాల సర్పంచులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల కొరడా

నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు -ట్రాఫిక్ సిఐ వెంకటేశ్వర్లు



షాద్‌నగర్,(ప్రజావినికిడి):
షాద్ నగర్ పట్టణంలో వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా,నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా షాద్‌నగర్ చౌరస్తాలో వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల షాద్‌నగర్ పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు,ప్రజల ప్రాణాల భద్రత,ట్రాఫిక్ నియంత్రణ, నిబంధనల అమలు కోసం అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజల విజ్ఞప్తినీ దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ పోలీసులు స్పందించి షాద్‌నగర్ చౌరస్తాలో తనిఖీలు చేపట్టి నెంబర్ ప్లేట్ లేని వాహనాలకు జరిమానాలు విధించడం,వాహనదారులకు ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తానని పట్ల ప్రజల హర్షం వ్యక్తం చేశారు.
ఇదే నిఘా పట్టణమంతా కొనసాగాలి.:కేవలం చౌరస్తాకే పరిమితం కాకుండా మహబూబ్‌నగర్ రోడ్డు,హైదరాబాద్ రోడ్డు,పరిగి రోడ్డు,రైల్వే స్టేషన్ రోడ్డు తదితర ప్రధాన మార్గాల్లోనూ నిరంతర తనిఖీలు నిర్వహించాలని పట్టణవాసులు కోరుతున్నారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు తమ తనిఖీలను నిరంతరం కొనసాగించాలని, ప్రమాదాల నివారణకు మరిన్ని చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ సిఐతో పాటు,ఎస్ఐలు, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తట్టిఅన్నారంలో వ్యక్తి ఆత్మహత్య.. చికిత్స పొందుతూ మృతి

నాగోల్,(ప్రజావినికిడి):
తట్టిఅన్నారం ప్రాంతంలో ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంసీహెచ్ కాలనీకి చెందిన గుండగోని సైదులు (50), వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. ఇతని తమ్ముడు గుండగోని జానకిరాములు (43),వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్, సత్యనగర్, చైతన్యపురిలో నివాసం ఉంటున్నాడు.
జానకిరాములు కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు జతీ.చీశీ.1304/2026 నమోదు చేశారు.



ఈ క్రమంలో 11-11-2026న ఉదయం సుమారు 05:30 గంటల సమయంలో తట్టిఅన్నారం ప్రాంతంలో జానకిరాములు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నట్లు సమాచారం. వెంటనే అతడిని 108 అంబులెన్స్ ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ 15-11-2026న ఉదయం 08:10 గంటల సమయంలో మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఘటనపై మృతుడి సోదరుడు గుండగోని సైదులు 16-11-2026న నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు Cr.No.717/2026 U/s 194 BNSS కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సామూహిక దీక్షను విజయవంతం చేయండి

కన్వీనర్ పోరిక స్వరూప్ సింగ్



వాజేడు,నవంబర్ 17,(ప్రజావినికిడి):
ములుగు జిల్లా కేంద్రంలో నవంబర్ 17న, తలపెట్టిన సామూహిక దీక్షను విజయవంతం చేయాలని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూషనరీ పెన్షన్ ఎంప్లాయిస్ యూనియన్ వాజేడు మండల గౌరవ అధ్యక్షులు పోరిక స్వరూప్ సింగ్ పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన సన్నాహక సమావేశంలో స్వరూప్ సింగ్ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని తీసుకువచ్చి ఉద్యోగులందరికి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.నూతన పెన్షన్ విధానంలో ఉద్యోగులకు లభించే పెన్షన్ కనీస కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి కూడా సరిపోవడంలేదని ప్రభుత్వం పెద్ద మనసుతో ఆలోచించి ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఉద్యోగుల యొక్క మనోగతాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తలపెట్టిన సామూహిక సెలవు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్వరూప్ సింగ్ పిలుపునిచ్చారు అనంతరం సామూహిక సెలవు పత్రాలను డిడిఓ,కు అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎస్ నాయకులు జానకిరామ్, రాంబాబు, బాలాజీ సతీష్ కుమార్,రాజేష్, ప్రేమ్ కుమార్, శ్రీకాంత్, నాగార్జున, నాగేంద్ర ప్రసాద్, మనోజ్, అలీముద్దీన్ ఖాద్రీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ బీసీ హాస్టల్ విద్యార్థి ప్రణయ్ మృతి

ఘటనపై విద్యార్థి,కుల సంఘాల ఆగ్రహం



షాద్‌నగర్,(ప్రజావినికిడి): పట్టణంలోని బీసీ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రణయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటనపై విద్యార్థి కుల సంఘాల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రణయ్ మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపించాలని,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.విద్యార్థి హాస్టల్‌లో ఉండాల్సిన సమయంలో రాత్రివేళ బయటకు వెళ్లి క్యాటరింగ్ పనికి వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని వారు ప్రశ్నించారు.
హాస్టల్ వార్డెన్,వాచ్‌మన్,ఇతర హాస్టల్ సిబ్బంది విద్యార్థుల భద్రతపై ఎలాంటి పర్యవేక్షణ చేస్తున్నారని నిలదీశారు.ఫంక్షన్ హాల్ యాజమాన్యం,క్యాటరింగ్ కాంట్రాక్టర్లు విద్యార్థులతో పనులు చేయిస్తున్న విషయంలో వారి బాధ్యతను కూడా పూర్తిగా విచారించాలని డిమాండ్ చేశారు.విద్యార్థి భద్రతకు సంబంధించి నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన ఉన్నట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ల నరసింహ మాదిగ,బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పసుపుల ప్రశాంత్, ఏఐఎస్ఎఫ్,
రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పవన్ చౌహాన్, ఆకాశ్,వారు మాట్లాడుతూ,పేద విద్యార్థులు ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకుంటున్నారనే కారణంతో వారి భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ప్రణయ్ కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రణయ్ మృతికి కారణమైన పరిస్థితులపై పూర్తిస్థాయి విచారణ జరపకుండా చేతులు దులుపుకుంటే విద్యార్థి సంఘాలు,కుల సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.



ప్రత్యేకంగా ఫంక్షన్ హాల్ యాజమాన్యం, క్యాటరింగ్ కాంట్రాక్టర్లు,హాస్టల్ వార్డెన్,హాస్టల్ సిబ్బంది పాత్రలపై విచారణ జరిపి, ఎవరి నిర్లక్ష్యం బయటపడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రెండు ద్విచక్ర వాహనాల దొంగతనం కేసుల్లో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

షాద్ నగర్,(ప్రజావినికిడి):
షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు ద్విచక్ర వాహనాల దొంగతనం కేసుల్లో నిందితుడికి న్యాయస్థానం ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానా విధించింది.
ఈ మేరకు సోమవారం షాద్‌నగర్‌లోని మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు వెలువరించింది.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..
హౌస్ స్టేషన్ ఆఫీసర్ కే.సీతారాం వెల్లడించిన వివరాల ప్రకారం,జనవరి 3న 2026 షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. షాద్‌నగర్‌కు చెందిన ఆకుల సంపత్ తన ఏపీ-22-ఏజీ-9589 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని పరిగి రోడ్డులోని హనుమాన్ దేవాలయం వెనుక వైపున ఉన్న దివ్య ఆసుపత్రి సమీపంలో నిలిపి ఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు.అదే రోజు మరో ప్రాంతంలో నడికూడ రాఘవేందర్ యాదవ్‌కు చెందిన



టీఎస్-07-జీబీ-1587నంబర్ గల స్ప్లెండర్ ప్లస్ వాహనం కూడా చోరీకి గురైంది.
ఈ ఘటనలపై బాధితుల ఫిర్యాదుల మేరకు షాద్‌నగర్ పోలీసులు క్రైమ్ నంబర్ 92/2026, 95/2026 కింద వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ క్రమంలో ఫరూఖ్‌నగర్ మండలం మాల ఎలికట్ట గ్రామానికి చెందిన జక్కుల శివలింగం (35)ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు.
కేసుల విచారణలో నేరం రుజువు కావడంతో భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్ 317(2) కింద నిందితుడికి ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది.
ఈ కేసుల్లో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఎస్ ఐ జి.శివారెడ్డి,హెడ్ కానిస్టేబుల్ పి.రవీందర్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణోదయ కుమార్‌తో పాటు కోర్టు విధులు నిర్వహించిన పోలీసు సిబ్బందిని షాద్‌నగర్ పోలీస్ శాఖ అభినందించింది.
ఈ సందర్భంగా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.సీతారాం మాట్లాడుతూ, నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, నేరస్తులకు న్యాయస్థానాల్లో శిక్షలు పడేలా పోలీసులు నిరంతరం కృషి చేస్తారని స్పష్టం చేశారు.

న్యూ ఢిల్లీలో జాతీయ సేవా రత్న అవార్డు అందుకున్న ఆకుల సిద్ధప్ప



షాద్ నగర్,(ప్రజావినికిడి):న్యూ ఢిల్లీలోని కరోల్ భాగ్ లో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 20వ, జాతీయ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఢిల్లీ సమాచార కమిషనర్ సంధ్యారాణి, కరోల్ భాగ్ ఎమ్మెల్యే విశేష్ రవిజీ పాల్గొన్నారు. అలాగే దేశంలోని 14 రాష్ట్రాల ప్రతినిధుల సమక్షంలో బిఎస్ఎ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా ఈ యొక్క అవార్డు ప్రదానం చేశారు. జాతీయ సేవరత్న అవార్డు అందుకున్న ఆకుల సిద్ధప్ప రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆర్టీసీ బస్టాండ్ లోని విజిలెన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణ ప్రయాణికులకు భద్రత సంక్షేమం వివిధ దొంగతనాలు కేసులను చేదనలో ఆయన చేసిన కృషిని గుర్తించి ఈ అంశాల ఆధారంగానేసామాజిక సేవ, సమాజ అభ్యున్నతి, పెంపొందించేందుకు కృషి చేస్తున్న వారిని గుర్తించి, ప్రోత్సహించాలనే లక్ష్యంతో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో అవార్డులను అందజేస్తున్నమన్నారు.ఈ నేపథ్యంలో జాతీయ సేవరత్న అవార్డుకు చౌదూర్ ఆకుల సిద్ధప్ప అవార్డు అందుకోవడం విశేషం.ఈ కార్యక్రమంలో బిఎస్ఎ రాష్ట్ర నాయకులు కోటేశ్వరరావు, విజయ్ కుమార్, విష్ణు వర్ధన్, అవార్డుల ఎంపిక కమిటీ సభ్యులు, ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు చొక్కంపేట అంజనేయులు, సామాజిక ఉద్యమకారులు శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అవార్డుకు ఎంపికైన ఆకుల సిద్ధప్పకు పలువురు అభినందించారు. డా.బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు అందజేసిన కాంగ్రెస్ నాయకులు

కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో బాధితులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా శస్త్రచికిత్సలు, వైద్య చికిత్సల నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు పత్రాలు (చెక్కులు) అందజేశారు.
సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం పొందిన



లబ్ధిదారుల వివరాలు..
1బుల్లె ఐలయ్య -రూ.60,000
2.గొల్ల మల్లేష్- రూ.30,000
3.ఎస్.రవి బాబు-రూ. 45,000
4.కాసారానేని శేషగిరి రావు- రూ.60,000
5.నూర్ మహమ్మద్-రూ. 40,000
6.మహమ్మద్ యాకుబీ-రూ. 51,000
మొత్తం మంజూరైన ఆర్థిక సహాయం:రూ. 2,86,000
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్సలు పొందలేని నిరుపేదలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమం,ఆరోగ్య భద్రతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ పండరి రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మా రెడ్డి,రషీద్, ప్రసన్న కుమార్, డప్పు నరేందర్, మహమ్మద్ గఫ్ఫార్ తదితరులు పాల్గొన్నారు

ఆ భోళా శంకరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

: బిఆర్ఎస్ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి): సిఎంసి కొంపల్లి సర్కిల్ పరిధి జయభేరి పార్క్ నందు శ్రీ అన్నపూర్ణ రాజరాజేశ్వర స్వామి దేవాలయం పంచమ వార్షికోత్సవ మహోత్సవానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,అతి పవిత్రమైన కార్తీక మాసంలో భక్తులందరిచే పూజలు అందుకుంటున్న ఆ రాజరాజేశ్వర స్వామి దివ్య అనుగ్రహాలు భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలి.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మధుసూదన్ రావు,గోపాల్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, దుర్గారావు, గోపాల్ రెడ్డి, సాయిబాబా, రాజా వెంకట్ రెడ్డి,సురేందర్ రెడ్డి,బిరాదర్, నరేష్ కుమార్ రెడ్డి,అశోక్ రెడ్డి, సాయిబాబా రాజు,ఎక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి,నాయకులు పందిరి యాదగిరి, పుప్పాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు, నందిగామ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి.

ఆర్డీఒకు వినతిపత్రం అందజేసిన టీఆర్పీ షాద్‌నగర్ ఇన్‌చార్జి ఎమ్మే సంతోష్

షాద్ నగర్,(ప్రజావినికిడి): నియోజక వర్గంలోని కొందుర్గు,నందిగామ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని టీఆర్పీ షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంఏ సంతోష్ ప్రభుత్వాన్ని కోరారు.ఈ మేరకు షాద్‌నగర్ ఆర్డీఒ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్డీఒకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మే సంతోష్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో కొందుర్గు, నందిగామ మండలాల్లో పెద్దఎత్తున వరి పంటలు ఎండిపోయాయని తెలిపారు. ఎకరాకు సుమారు రూ.45 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు పంటలు చేతికందే సమయంలో నష్టపోవడంతో తీవ్ర ఆర్థిక



ఇబ్బందులుఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.
అప్పులు చేసి సాగు చేసిన రైతులు వాటిని ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందుతున్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ రెండు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి,పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు.పంటలు చేతికొచ్చే అవకాశం ఉన్న పంటలను కాపాడేందుకు వీలైనంత మేర నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.రైతులకు ఆర్థిక సహాయం అందిస్తే తదుపరి పంట సాగుకు అవకాశం ఉంటుందని,రైతులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఆర్పీ ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు ఆవ జగన్,షాద్‌నగర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు రాములు,
ఉపాధ్యక్షులు గోపాల్, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఆధారంగా పోయిన సూట్‌కేస్ గుర్తింపు

బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులతో సహా బాధితుడికి అప్పగింత





శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 16: ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ అవుట్‌పోస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో కనిపించకుండా పోయిన ప్రయాణికుడి సూట్‌కేస్‌ను పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి తిరిగి బాధితుడికి అప్పగించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బి.అభినయ్ వత్సల్ ఈ నెల 14న హాంకాంగ్ నుంచి సిఎక్స్601 విమానంలో హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఆయనకు చెందిన క్యాబిన్ సూట్‌కేస్ కనిపించకుండా పోవడంతో ఎయిర్‌పోర్ట్ అవుట్‌పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు సూట్‌కేస్‌లో సుమారు ఐదు తులాల బంగారం,రెండు బంగారు గొలుసులు, రెండు ఉంగరాలు, రెండు జతల చెవి దిద్దులు,ఒక మొబైల్ ఫోన్, హార్డ్‌డిస్క్ ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఈ నెల15న విమానం దిగిన ప్రాంతం నుంచి పార్కింగ్ స్థలం వరకు ఉన్న సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ఈ క్రమంలో మరో ప్రయాణికుడు సూట్‌కేస్‌ను తీసుకుని కారులో వెళ్లినట్లు గుర్తించారు. అనంతరం వాహనం రిజిస్ట్రేషన్ వివరాల ఆధారంగా విచారణ చేపట్టగా,ఆ వాహనం ముగ్గురి పేర్లపై రిజిస్టర్ అయి ఉన్నట్లు గుర్తించారు. వారు ఇటీవలే వాహనాన్ని మరొక వ్యక్తికి విక్రయించినట్లు పోలీసులకు తెలిపారు.దీంతో ప్రస్తుత వాహన యజమాని వివరాలను సేకరించిన పోలీసులు అతడిని సంప్రదించి పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. అనంతరం కనిపించకుండా పోయిన సూట్‌కేస్‌ను స్వాధీనం చేసుకుని, అందులోని వస్తువులతో సహా ఫిర్యాదుదారుడు అభినయ్ వత్సల్‌కు పోలీస్ స్టేషన్‌లో తిరిగి అప్పగించినట్లు పోలీసులు వెల్లడించారు.

జర్నలిస్టుల పాత్ర సమాజానికి ఎంతో కీలకం..

ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా సేవలు అభినందనీయం.

కుత్బుల్లాపూర్ టిడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీకి ప్రముఖుల అభినందనలు..



కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ తెలంగాణ రాష్ట్ర జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నూతన కమిటీ సభ్యులు సోమవారం పలువురు ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా మత్స్యశాఖ సహకార సంఘాల (డీఎఫ్‌సీఎస్) చైర్మన్ మన్నె రాజు, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ (ఐఏఎస్)లను కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.
ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు వారు అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ,జర్నలిస్టుల పాత్ర,సమాజం పట్ల వారి బాధ్యతలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా మత్స్యశాఖ సహకార సంఘాల (డీఎఫ్‌సీఎస్) చైర్మన్ మన్నె రాజు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ కావడానికి మీడియా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.
జర్నలిస్టులు వాస్తవాలను ప్రజల ముందుంచుతూ, సమాజ అభ్యున్నతికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ జర్నలిస్టుల ఐక్యతకు, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని సూచించారు. కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ అధికారులు, జర్నలిస్టుల మధ్య ఎప్పుడూ స్నేహపూర్వకమైన, పరస్పర గౌరవంతో కూడిన సంబంధాలు ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తారని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, మీడియా సమన్వయంతో పనిచేయాలని అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ఇరువురి మధ్య సత్సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు



మాట్లాడుతూ,జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన గౌరవం కోసంఎల్లప్పుడూ ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు ఏ. గోవిందరావు,కార్యదర్శి పి.బ్రహ్మచారి, ఉపాధ్యక్షురాలు మంజుల రెడ్డి, కమిటీ సభ్యులు కుమార్ గౌడ్, శ్యామ్ ముదిరాజ్, సుస్మిత,లక్ష్మి మేడ్చల్ జిల్లా కార్యదర్శి గడ్డమీది అశోక్, తేజోమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఒకే పరికరంతో మంచినీరు, ఏసీ సౌకర్యం..

బిట్స్ హైదరాబాద్ శాస్త్రవేత్తల ఘనత



హైదరాబాద్ నవంబర్ 16(ప్రజావినికిడి):
ఉప్పు నీటిని స్వచ్ఛమైన తాగునీరుగా మారుస్తూ, అదే సమయంలో గదికి చల్లటి ఏసీ గాలిని అందించే సరికొత్త పోర్టబుల్ పరికరాన్ని బిట్స్ పిలానీ హైదరాబాద్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. సౌరశక్తితో పనిచేసే ఈ వినూత్న సాంకేతికతకు భారత ప్రభుత్వం నుంచి అధికారికంగా పేటెంట్ (పేటెంట్ నం. 558052) లభించింది. బిట్స్ పిలానీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ సందీప్ ఎస్ దేశ్‌ముఖ్, ప్రొఫెసర్ శంతను ప్రసాద్ దత్తా, రీసెర్చ్ స్కాలర్ కె. సాయి సందీప్ సంయుక్తంగా ఈ పరికరాన్ని రూపొందించారు.సాధారణంగా సముద్రపు నీటిని లేదా ఉప్పు నీటిని శుద్ధి చేయడానికి, అలాగే గదులను చల్లబరచడానికి (ఏసీ) విడివిడిగా భారీ మొత్తంలో విద్యుత్ ఖర్చవుతుంది. అయితే, ఈ రెండు ప్రక్రియలను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావడం ద్వారా విద్యుత్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ఈ పరిశోధకులు నిరూపించారు.

పనిచేసే విధానం:
ఈ పరికరం మొదట పరిసరాల్లోని సాధారణ గాలిని వేడి చేసి, దానిని హ్యూమిడిఫైయర్ ద్వారా పంపుతుంది. అక్కడ ఆ గాలి ఉప్పు నీటిలోని తేమను గ్రహిస్తుంది. ఆ తర్వాత, తేమతో కూడిన ఆ గాలిని చల్లబరిచినప్పుడు నీటి ఆవిరి ద్రవీభవించి స్వచ్ఛమైన తాగునీరుగా మారుతుంది. అదే సమయంలో బయటకు వచ్చే పొడి, చల్లని గాలి గదిని ఏసీ తరహాలో ఆహ్లాదకరంగా మారుస్తుంది. ఈ విధంగా ఒకే ప్రక్రియ ద్వారా నీటి శుద్ధి, ఎయిర్ కండిషనింగ్ రెండూ పూర్తవుతాయి.

పరిశోధనలో తేలిన ఫలితాలు:
ప్రయోగశాల స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు నమోదయ్యాయి. గరిష్ఠ తేమ ఉన్న పరిస్థితుల్లో డబుల్ స్టేజ్ సెటప్ ద్వారా గంటకు దాదాపు 12.4 లీటర్ల స్వచ్ఛమైన నీటిని ఉత్పత్తి చేయగలిగారు. అలాగే, 6.57 కిలోవాట్ల వరకు శీతలీకరణ (కూలింగ్) సామర్థ్యం నమోదైంది. దీనిద్వారా దాదాపు 14 డిగ్రీల సెల్సియస్ వరకు చల్లటి గాలిని అందించడం సాధ్యమైంది. పరీక్షల్లో లీటరు నీటి కనీస ఉత్పత్తి వ్యయం కేవలం 30 పైసలుగా తేలింది. ఈ పరికరం ద్వారా రోజుకు 200 లీటర్ల తాగునీటిని అందించాలని బృందం లక్ష్యంగా పెట్టుకుంది.
ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పరిశోధనా పత్రం అంతర్జాతీయ జర్నల్ 'అప్లైడ్ థర్మల్ ఇంజనీరింగ్'లో ప్రచురితమైంది. ఈ ఫలితాలు ప్రస్తుతం ల్యాబ్ స్థాయిలో సాధించినవి కావడంతో, వివిధ ప్రాంతాల్లోని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసి ఫీల్డ్ ట్రయల్స్ నిర్వహించాలని బృందం యోచిస్తోంది. క్షేత్రస్థాయిలో విస్తృతంగా అందుబాటులోకి తెచ్చేందుకు పారిశ్రామిక భాగస్వాముల కోసం అన్వేషిస్తున్నారు. ముఖ్యంగా తాగునీటి కొరత, విపరీతమైన ఎండలతో ఇబ్బంది పడే తీర ప్రాంతాలు, ద్వీప వాసులకు ఈ ఆవిష్కరణ ఎంతో ఉపయోగకరంగా మారనుంది.ం

భారత్ సమ్మిట్‌లో ఇటలీ నేత వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరపాలి..

ఫిలిబెక్ వీసా, పర్యటన ఉద్దేశాన్ని పరిశీలించాలి.. -తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు..







శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 16,
భారత్ సమ్మిట్‌లో ఇటలీకి చెందిన జియాకోమో ఫిలిబెక్ చేసిన వ్యాఖ్యలు భారత అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకునే విధంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. నవంబర్ 14న హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్‌లో 'ఓట్ చోర్..గద్దీ ఛోడ్' వంటి నినాదాలు చేయడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ శంషాబాద్‌లోని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, ఫిలిబెక్ ఏ కేటగిరీ వీసాపై భారతదేశానికి వచ్చారు.? ఆయన పర్యటన వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి.? భారత్‌లో రాజకీయపరమైన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అవసరమైన అనుమతులు పొందారా.? అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ జరపాలని కోరారు.వీసా నిబంధనలు, ఇమ్మిగ్రేషన్ చట్టాల ఉల్లంఘన జరిగిందా లేదా అన్నది తేల్చాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025లోని సెక్షన్లు 23,24 ప్రకారం ఈ వ్యవహారాన్ని పరిశీలించాలని ఫిర్యాదులో కోరినట్లు వెల్లడించారు. కేంద్ర హోంశాఖ, విదేశాంగ శాఖ అనుమతులు, రాజకీయ క్లియరెన్స్‌లు పొందారా? సమ్మిట్ నిర్వాహకులు జారీ చేసిన ఆహ్వాన పత్రాలు, వీసా దరఖాస్తులు, అధికారులకు సమర్పించిన డిక్లరేషన్లను పరిశీలించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.ఈ వ్యవహారంలో సమ్మిట్ నిర్వాహకులు, స్పాన్సర్లు,ఇతర సంబంధిత వ్యక్తుల పాత్రపైనా విచారణ జరపాలని కోరామన్నారు. విచారణలో చట్ట ఉల్లంఘనలకు సంబంధించిన ఆధారాలు లభిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, చట్టపరమైన కారణాలు నిర్ధారణ అయితే ఫిలిబెక్‌ను దేశం నుంచి బహిష్కరించే అంశాన్ని కూడా పరిశీలించాలని అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. భారతదేశం సార్వభౌమత్వాన్ని,ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన అవసరం ఉందని రాంచందర్ రావు అన్నారు.విదేశీ పౌరులెవరూ భారత చట్టాలకు అతీతులు కారని, భారతదేశానికి వచ్చే ప్రతి విదేశీ ప్రతినిధి ఇక్కడి చట్టాలు, ఇమ్మిగ్రేషన్ నిబంధనలను తప్పనిసరిగా గౌరవించాలని ఆయన స్పష్టం చేశారు

కరీంనగర్ సీపీ వివాదం

: పాడి కౌశిక్ రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ



హైదరాబాద్ నవంబర్ 16: (ప్రజావినికిడి):
కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. తన గొంతు నమూనాలు (వాయిస్ శాంపిల్స్) ఇవ్వాలని పోలీసులు జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో ఆయన పోలీసు దర్యాప్తునకు సహకరించి వాయిస్ శాంపిల్స్ ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది.ఈ ఏడాది జనవరి 29న జరిగిన మినీ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా అప్పటి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై కరీంనగర్ జిల్లా వీణవంక పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఘటన నాటి ఆడియో, వీడియో రికార్డులను పరిశీలించిన పోలీసులు.. వాటిని సరిపోల్చేందుకుకౌశిక్ రెడ్డి గొంతు నమూనాలను సేకరించాలని నిర్ణయించారు.వాయిస్ శాంపిల్స్ సేకరణకు సంబంధించి మేజిస్ట్రేట్ కోర్టు అనుమతి ఇవ్వడంతో దర్యాప్తు అధికారులు కౌశిక్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. అయితే, కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను, పోలీసు నోటీసులను రద్దు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే హైకోర్టులో రివిజన్ పిటిషన్ వేశారు. పోలీసుల చర్య చట్టవిరుద్ధమని, తన హక్కులను కాలరాయడమేనని కౌశిక్ రెడ్డి తరఫు న్యాయవాదులు వాదించారు.మరోవైపు ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నేర విచారణలో భాగంగా ఆధారాలను శాస్త్రీయంగా ధ్రువీకరించేందుకు నిందితుల వాయిస్ శాంపిల్స్ సేకరించడం సాధారణ ప్రక్రియేనని స్పష్టం చేశారు. ఇరుపక్షాల వాదనలను క్షుణ్ణంగా పరిశీలించిన హైకోర్టు.. దర్యాప్తు ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ కౌశిక్ రెడ్డి పిటిషన్‌ను కొట్టివేసింది.

గే డేటింగ్ యాప్ ద్వారా వల వేస్తున్న ముఠా అరెస్ట్

కుషాయిగూడ పోలీసుల చేతికి చిక్కిన ఐదుగురు నిందితులు

మత్తుమందు ఇచ్చి నగదు, ఆభరణాలు దోపిడీ

నిందితుల నుంచి 35 తులాల బంగారం స్వాధీనం

వీడియోలు తీసి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్న వైనం



హైదరాబాద్ నవంబర్ 16: (ప్రజావినికిడి):
హైదరాబాద్‌లోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో డేటింగ్ యాప్ కేంద్రంగా సాగుతున్న దారుణ మోసం వెలుగులోకి వచ్చింది. గే డేటింగ్ యాప్ ద్వారా అమాయకులను లక్ష్యంగా చేసుకుని, వారిని ఏకాంతంగా పిలిపించి నిలువుదోపిడీ చేస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ ముఠా కార్యకలాపాలపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు గే డేటింగ్ యాప్‌లో ఖాతాలు తెరిచి వ్యక్తులతో పరిచయాలు పెంచుకునేవారు. బాధితులతో మాటలు కలిపి, వారిని నమ్మించి నేరుగా కలుసుకుందామంటూ ఏదో ఒక ప్రైవేట్ గదికి రప్పించేవారు. బాధితులు అక్కడికి చేరుకోగానే వారికి మత్తుమందు కలిపిన పదార్థాలు లేదా పానీయాలు ఇచ్చేవారు.బాధితులు మత్తులోకి జారుకోగానే, వారి వద్ద ఉన్న నగదు, బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను దోచుకుని నిందితులు పరారయ్యేవారు. అరెస్ట్ చేసిన నిందితుల నుంచి పోలీసులు సుమారు 35 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఒకవేళ బాధితుల వద్ద ఎలాంటి నగదు లేదా విలువైన వస్తువులు దొరకకపోతే, నిందితులు వారి వ్యక్తిగత వీడియోలను మొబైల్ ఫోన్లలో రికార్డ్ చేసేవారని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆ వీడియోలను బయటపెడతామని, పరువు తీస్తామని బాధితులను తీవ్రంగా భయభ్రాంతులకు గురిచేసి, వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు గుంజేవారని అధికారులు పేర్కొన్నారు.ఈ ఘటనపై కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ ముఠా చేతిలో ఇంకా ఎంతమంది బాధితులు మోసపోయారనే కోణంలో లోతైన విచారణ జరుపుతున్నారు. గుర్తుతెలియని వ్యక్తులతో డేటింగ్ యాప్‌లలో పరిచయాలు చేసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సెలయేటి గలగల.. చిరుగాలి కిలకిల..



గానామృతంతో మురిసిన సంగీత ప్రియులు.!

శ్రీ సరస్వతి కళా పీఠం ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు..

చిన్నారుల నుంచి సీనియర్ కళాకారుల వరకు గాన విభావరి

ఆద్యంతం ఆసక్తిగా సాగిన సినీ గీతాల విభావరి





హైదరాబాద్, (ప్రజావినికిడి):

చిరుగాలి తరగల్లా మెల్లగా.. సెలయేటి నురగల్లా తెల్లగా.. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను తట్టిలేపుతూ గుండెలను హత్తుకునే గీతాలు ఒక్కొక్కటిగా విరిశాయి. మల్లెలు పూసే వెన్నెల రేయిలా.. మధురమైన స్వరాల జల్లులో సంగీత ప్రియులు పరవశించారు. చిన్నారుల చిరునవ్వులు.. సీనియర్ గాయకుల అనుభవ గళాలు.. వర్ధమాన కళాకారుల ఉత్సాహభరిత ఆలాపనలు వెరసి ఓ అద్భుతమైన సంగీత సంబరానికి వేదికయ్యాయి.

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ సరస్వతి కళా పీఠం ఆధ్వర్యంలో 'సిరిమల్లెపువ్వులే నవ్వు..చిన్నారి పాపల్లే నవ్వు' పేరిట హిమాయత్‌నగర్‌లోని సరిగమ మ్యూజికల్ హాలులో ప్రత్యేక గాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాపీఠం నిర్వాహకురాలు, ఈలపాట గాయని రోజా మధిర, న్యాయవాది వేణుగోపాల్ దంపతుల ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాగిన ఈ సంగీత విభావరి ఆద్యంతం సినీ మధుర గీతాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది.



కార్యక్రమం కేపీ ఆలపించిన 'రఘుకుల తిలకా రారా'భక్తిగీతంతో ప్రారంభమైంది. అనంతరం కొమ్మినేని రత్నకుమారి, క్రాంతి ఆలపించిన 'సన్నజాజి పువ్వులు', రత్నకుమారి చిన్నారులతో కలిసి పాడిన పండిట్ నెహ్రూ జన్మదిన గీతం, మోహన్,రమణి గళాల నుంచి జాలువారిన 'సెలయేటి గలగల'వంటి పాటలు సంగీత ప్రియులను అలరించాయి. రోజా మధిర తనదైన ప్రత్యేకతతో ఈలపాటలో ఆలపించిన 'మల్లెలు పూసే.. వెన్నెల కాసే' గీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కేపీ, రోజా మధిర కలిసి ఆలపించిన 'ఒక కొమ్మకు పూసిన పువ్వులం',కేపీ ప్రత్యేకంగా పాడిన 'హెచ్చరికో హెచ్చరిక',కేపీ, అక్షర ఆలపించిన హాస్య గీతం 'ముత్యాలు వస్తావా.. అడిగింది ఇస్తావా' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సీనియర్ గాయకురాలు కొమ్మినేని రత్నకుమారి, రమణి,ఉదయ్ భాస్కర్ తమ అనుభవంతో కూడిన గాత్రంతో అలరించగా.. వర్ధమాన గాయకులు మోహన్,క్రాంతి చక్కని ఆలాపనలతో ఆకట్టుకున్నారు. శ్రీరాణి తన ప్రత్యేక గాత్రంతో సంగీతాభిమానులను మెప్పించారు. యాదగిరి తనదైన బాణీలో పాటలు పాడుతూ అలరించారు. తండ్రి యాదగిరి, కుమార్తె అక్షర కలిసి ఆలపించిన 'యమహో నీ యమా యమ' పాట ప్రత్యేకంగా నిలిచింది. చిన్నారులు మనస్విని, అస్మిత, శరణ్యాక్షిత తమ లయబద్ధమైన గానంతో అందరి ప్రశంసలు అందుకున్నారు. కేపీతో కలిసి చిన్నారులు అక్షర,మనస్విని, శరణ్యాక్షిత, అస్మిత ఆలపించిన 'భారత మాతకు జేజేలు'గీతం కార్యక్రమానికే హైలైట్‌గా నిలిచింది. అలాగే కేపీ,శరణ్యాక్షిత పాడిన 'ఓహో బుల్లి పావురమా', కేపీ,అస్మిత ఆలపించిన 'రాళ్లల్లో ఇసుకల్లో',కేపీ, మనస్విని పాడిన 'అహో ప్రియా' వంటి గీతాలు ప్రేక్షకులను పులకింపజేశాయిఇక రమణి, క్రాంతి ఆలపించిన 'కిన్నెరసాని వచ్చిందమ్మా', రోజా,మోహన్ పాడిన'ప్రియా ప్రియతమా రాగాలు', యాదగిరి, రత్నకుమారి ఆలపించిన 'ఝుమ్మంది నాదం','కోకిలమ్మ పెళ్లికి కోనంతా సందడి',ఉదయ భాస్కర్, రత్నకుమారి పాడిన 'వీణ వేణువైన సరిగమ',కేపీ, అక్షర ఆలపించిన 'సిరిమల్లె పువ్వుల్లే నవ్వు' వంటి పాటలు శ్రోతలను పాత మధుర జ్ఞాపకాలలోకి తీసుకెళ్లాయి.కేపీ సోలోగా ఆలపించిన 'నీవుంటే వేరే కనులెందుకు' పాట కూడా ప్రత్యేక ప్రశంసలు అందుకుంది.

అద్భుతం మీ గానామృతం

విజయవాడకు చెందిన కళాకారుడు మహంతి రమణ మాట్లాడుతూ, చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ ఎంతో పరిణతితో పాటలు పాడుతూ అలరించడం తనను విశేషంగా ఆకట్టుకుందని ప్రశంసించారు. ఇలాంటి అద్భుతమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ కొత్త కళాకారులను ప్రోత్సహిస్తున్న రోజా మధిరను అభినందించారు. జర్నలిస్ట్ కేపీని 'జూనియర్ బాలు'గా అభివర్ణిస్తూ, ప్రముఖ గాయకుల గాత్రశైలిని అనుకరిస్తూ వారి పాటలను వారిలాగే ఆలపించడం గొప్ప కళ అని కొనియాడారు. కళాకారులందరూ విజయవాడకు వచ్చి తమ గానంతో అలరించాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహంతి రమణను కళాపీఠం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

మా పాట సజీవం

ఆదరించే ప్రేక్షక లోకం ఉన్నంతకాలం తమ పాట సజీవంగా ఉంటుందని శ్రీ సరస్వతి కళా పీఠం నిర్వాహకురాలు, ఈలపాట రికార్డు గాయని రోజా మధిర అన్నారు. కళాపీఠం ద్వారా వర్ధమాన గాయకులను, చిన్నారులను ప్రోత్సహిస్తూ సంగీత కళకు సేవ చేస్తున్నామని తెలిపారు.పాత, కొత్త పాటల మేలి కలయికతో కార్యక్రమాలను రూపొందిస్తున్నామని,బాలల దినోత్సవ వేడుకలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిభకు సినిమాల్లో అవకాశాలు

వర్ధమాన గాయకులకు సినిమాల్లో అవకాశాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆల్ ఇండియా కృష్ణ, మహేష్ ప్రజాసేన అధ్యక్షుడు ఎం.డి.ఖాదర్ గోరి హామీ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కళాకారులను సత్కరించి బహుమతులు అందజేశారు. పలుమార్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యానని, ప్రతిసారీ అద్భుతమైన గానాన్ని ఆస్వాదిస్తున్నానని తెలిపారు.సినీ రంగంలో తనకున్న పరిచయాలను ఉపయోగించి ప్రతిభ కలిగిన కళాకారులను ప్రోత్సహిస్తానని పేర్కొన్నారు. మొత్తంగా ఐదు గంటలపాటు సాగిన ఈ గాన విభావరి కేవలం పాటల కార్యక్రమంగానే కాకుండా చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే వేదికగా, సీనియర్ కళాకారులు-వర్ధమాన గాయకులను ఒకే వేదికపైకి తీసుకొచ్చే సంగీత సంగమంగా నిలిచింది.పాట ముగిసినా.. ఆ స్వరాల మాధుర్యం మాత్రం ప్రేక్షకుల హృదయాల్లో చాలాసేపు ప్రతిధ్వనిస్తూనే ఉంది.



























ముంబై వీధుల్లో యువరాజు దంపతుల గల్లీ క్రికెట్ సందడి!

సచిన్ టెండూల్కర్‌తో కలిసి బ్యాటింగ్, బౌలింగ్.. స్థానిక విద్యార్థులతో సరదాగా ఆట.. మట్టి కప్పుల్లో చాయ్ ఆస్వాదించిన ప్రిన్స్ విలియం, కేట్



హైదరాబాద్: బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియం, ఆయన భార్య ప్రిన్సెస్ కేట్ మిడిల్టన్ ముంబై వీధుల్లో సందడి చేశారు. తమ అధికారిక పర్యటనలో భాగంగా సంప్రదాయ కార్యక్రమాలకు భిన్నంగా స్థానిక చిన్నారులతో కలిసి గల్లీ క్రికెట్ ఆడుతూ అందరినీ ఆకట్టుకున్నారు. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కూడా ఈ ఆటలో పాల్గొనడంతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువరాజు దంపతులు చిన్నారులతో కలిసిపోయి సరదాగా క్రికెట్ ఆడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.బ్రిటన్ యువరాజు విలియం, ఆయన భార్య కేట్ మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా సోమవారం ముంబైకి చేరుకున్నారు. నగరంలోని బల్లార్డ్ ఎస్టేట్‌లో ఎన్. మొరార్జీ రోడ్డుపై ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడికి చేరుకున్న రాజదంపతులకు స్థానికులు సంప్రదాయ ఢోల్ తాషా వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక పాఠశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి గల్లీ క్రికెట్ ఆడారు.**సచిన్‌తో కలిసి క్రికెట్ అడిన యువరాజు**ఈ కార్యక్రమంలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పాల్గొని రాజదంపతులకు ఆటలో సూచనలు చేశారు. ప్రిన్స్ విలియం బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ తన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆయన ఐదు బంతులు ఆడిన అనంతరం ఐదో బంతికి బౌల్డ్ అయ్యారు. అనంతరం బౌలింగ్‌కు దిగిన విలియం బంతులను ఎదుర్కొన్న కేట్ మిడిల్టన్ కూడా బ్యాటింగ్‌లో ఆసక్తి చూపించారు. ఆమె దాదాపు రెండు ఓవర్ల పాటు బ్యాటింగ్ చేయగా, ఎనిమిదో బంతికి విలియం ఆమెను అవుట్ చేశారు.ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. కొందరు రాజదంపతులతో కలిసి క్రికెట్ ఆడగా, మరికొందరు ఆటను వీక్షిస్తూ ఉత్సాహంగా గడిపారు. సచిన్ టెండూల్కర్‌ను దగ్గరగా చూసి, ఆయనతో కలిసి క్రికెట్ ఆడే అవకాశం రావడం విద్యార్థులకు మధురానుభూతిగా మారింది.**మట్టి కప్పుల్లో చాయ్.. భారతీయ సంప్రదాయానికి ముగ్ధులు**క్రికెట్ ఆట ముగిసిన అనంతరం ప్రిన్స్ విలియం, కేట్ మిడిల్టన్ సచిన్ టెండూల్కర్‌తో కలిసి స్థానిక టీ దుకాణాన్ని సందర్శించారు. అక్కడ మట్టి కప్పుల్లో అందించిన సంప్రదాయ కుల్హడ్ చాయ్‌ను ఆస్వాదించారు. సాధారణ ప్రజల మధ్యకు వెళ్లి స్థానిక వాతావరణాన్ని అనుభవించడం ఈ పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టీ దుకాణం నిర్వాహకులు కూడా రాజదంపతులకు చాయ్ అందించడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.**పదేళ్ల తర్వాత మళ్లీ అదే సందడి**ప్రిన్స్ విలియం, కేట్ దంపతులు 2016లో కూడా భారతదేశంలో పర్యటించిన సందర్భంగా ముంబైలోని ఓవల్ మైదానంలో స్థానిక చిన్నారులతో కలిసి క్రికెట్ ఆడారు. అప్పట్లోనూ సచిన్ టెండూల్కర్ వారితో పాల్గొన్నారు. ఇప్పుడు పదేళ్ల తర్వాత మరోసారి ముంబైలో సచిన్‌తో కలిసి గల్లీ క్రికెట్ ఆడటంతో ఈ కార్యక్రమానికి మరింత ప్రత్యేకత ఏర్పడింది.**ఎర్త్‌షాట్ పురస్కారాల కోసం భారత్‌కు రాక**ప్రిన్స్ విలియం 2020లో ప్రారంభించిన 'ఎర్త్‌షాట్ ప్రైజ్' వార్షిక పురస్కారాల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ రాజదంపతులు భారత్‌కు వచ్చారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల నియంత్రణ, ప్రకృతి వనరుల సంరక్షణకు వినూత్న పరిష్కారాలు చూపుతున్న ప్రాజెక్టులను ఈ పురస్కారాల ద్వారా ప్రోత్సహిస్తున్నారు. నవంబర్ 17న జరిగే కార్యక్రమంలో ఐదు విభాగాల్లో ఎంపికైన విజేతలకు ఒక్కొక్కరికి మిలియన్ పౌండ్ల చొప్పున బహుమతి అందించనున్నారు.ఈ వేడుకకు బాలీవుడ్ దర్శకుడు కరణ్ జోహర్ వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. బాలీవుడ్ నటీనటులు అలియా భట్, సోనమ్ కపూర్, రామీ మాలెక్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. గాయని శ్రేయా ఘోషల్‌తో పాటు బ్రిటిష్ పాప్ సంగీత బృందం టేక్ దట్ ప్రత్యేక సంగీత ప్రదర్శనలు ఇవ్వనుంది.

ముంబై మెట్రో ప్రయాణం.. మోదీతో భేటీమూడు రోజుల పర్యటనలో భాగంగా రాజదంపతులు ముంబైలో మెట్రో రైలులో ప్రయాణించడంతో పాటు భారతీయ సినిమా, ఫ్యాషన్, పర్యావరణ ఆవిష్కరణలకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అనంతరం నవంబర్ 18న న్యూఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం కానున్నారు. మొత్తంగా ప్రిన్స్ విలియం, కేట్ మిడిల్టన్ పర్యటనలో గల్లీ క్రికెట్ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాజభవనాలకే పరిమితమయ్యే రాజదంపతులు సాధారణ ప్రజల మధ్యకు వచ్చి చిన్నారులతో కలిసి ఆటలాడటం, స్థానిక సంప్రదాయాలను ఆస్వాదించడం అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా సచిన్ టెండూల్కర్‌తో కలిసి క్రికెట్ ఆడటం భారత అభిమానులకు మరపురాని దృశ్యంగా నిలిచింది.

48 బంతుల్లో 135 పరుగులు.. పాటిదార్ ప్రపంచ రికార్డు!

- 13 సిక్సర్లు, 8 ఫోర్లతో విధ్వంసం.. అస్సాంపై మధ్యప్రదేశ్ ఘన విజయం



హైదరాబాద్: భారత క్రికెటర్, ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో సంచలన ఇన్నింగ్స్‌తో ప్రపంచ రికార్డు సృష్టించాడు. అస్సాంతో జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ తరఫున బరిలోకి దిగిన పాటిదార్ కేవలం 48 బంతుల్లోనే అజేయంగా 135 పరుగులు సాధించాడు. ఇందులో 13 సిక్సర్లు, 8 ఫోర్లు ఉన్నాయి. 281.25 స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేస్తూ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు.మధ్యప్రదేశ్ 57 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న సమయంలో క్రీజులోకి వచ్చిన పాటిదార్ జట్టును ఆదుకున్నాడు. శివాంగ్ కుమార్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 62 బంతుల్లో 153 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కేవలం 41 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. దీంతో మధ్యప్రదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 250 పరుగులు సాధించింది.251 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అస్సాం 17.4 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌటైంది. దీంతో మధ్యప్రదేశ్ 131 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

సిరీస్ గెలిచినా.. బ్యాటింగ్‌పై ఆందోళన!

● కోహ్లీ మినహా ఎవరూ అర్ధశతకం చేయలేదు.. బౌలర్లే భారత్‌కు విజయాన్ని అందించారు



హైదరాబాద్: న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌ను భారత్ 3-1తో కైవసం చేసుకున్నప్పటికీ బ్యాటర్ల ప్రదర్శన అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. 2027 వన్డే ప్రపంచకప్‌కు సన్నాహకంగా భావిస్తున్న ఈ సిరీస్‌లో భారత బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు.విరాట్ కోహ్లీ మినహా మరే భారత బ్యాటర్ కూడా అర్ధశతకం సాధించలేదు. తొలి వన్డేలో కోహ్లీ 51 బంతుల్లో 74 పరుగులు చేయగా, ఆ తర్వాత వరుసగా 7, 0, 5 పరుగులకే పరిమితమయ్యాడు. ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్ చివరి వన్డేలో చెరో 46 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచారు.రోహిత్ శర్మ సిరీస్ మొత్తంలో కేవలం 30 పరుగులే చేశాడు. శుభ్‌మన్ గిల్ అత్యధిక స్కోరు 37 పరుగులు కాగా, శ్రేయస్ అయ్యర్ 30 పరుగులకే పరిమితమయ్యాడు. కీలక ఆటగాళ్లు విఫలమవడం జట్టు యాజమాన్యానికి ఆందోళన కలిగిస్తోంది.మరోవైపు భారత బౌలర్లు అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయాన్ని అందించారు. అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్ మ్యాచ్‌లలో కీలకంగా నిలిచారు. నాలుగు మ్యాచ్‌ల్లో తొమ్మిది వికెట్లు తీసిన గుర్నూర్ బ్రార్‌కు సిరీస్ ఉత్తమ ఆటగాడి అవార్డు లభించింది. సిరీస్ గెలిచినా, ప్రపంచకప్‌కు ముందు బ్యాటింగ్ లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం భారత్‌పై ఉంది

ఐసీసీ చైర్మన్‌గా జై షా మరోసారి ఏకగ్రీవ ఎన్నిక



● రెండోసారి బాధ్యతలు..

ప్రపంచ క్రికెట్ అభివృద్ధిపై దృష్టి

హైదరాబాద్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్‌గా జై షా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండోసారి ఈ పదవికి ఎంపిక కావడంతో ప్రపంచ క్రికెట్ పాలనా వ్యవహారాల్లో ఆయన నాయకత్వం కొనసాగనుంది. ఇండోనేషియాలోని బాలిలో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశాల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఐసీసీ డైరెక్టర్లు ఆయన పేరును మరోసారి ప్రతిపాదించగా, సభ్యుల నుంచి ఏకగ్రీవ మద్దతు లభించింది. ప్రపంచ క్రికెట్ కీలక మార్పుల దశలో ఉన్న సమయంలో జై షా నాయకత్వాన్ని కొనసాగించాలని ఐసీసీ నిర్ణయించింది.2024 ఆగస్టులో తొలిసారిగా ఐసీసీ చైర్మన్‌గా ఎన్నికైన జై షా అదే ఏడాది డిసెంబర్ 1న బాధ్యతలు స్వీకరించారు. అప్పటికి 35 ఏళ్ల వయసులోనే ఈ పదవిని చేపట్టి ఐసీసీ చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడైన చైర్మన్‌గా గుర్తింపు పొందారు. అంతకుముందు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శిగా పనిచేశారు. భారత క్రికెట్ పరిపాలనలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన, అనంతరం అంతర్జాతీయ క్రికెట్ వ్యవహారాల్లోనూ తనదైన పాత్ర పోషిస్తున్నారు.**ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు ప్రాధాన్యం** జై షా రెండోసారి బాధ్యతలు చేపట్టనున్న సమయంలో క్రికెట్‌కు అంతర్జాతీయంగా మరింత ఆదరణ పెరుగుతోంది. ముఖ్యంగా 2028లో అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో జరిగే ఒలింపిక్ క్రీడల్లో క్రికెట్ తిరిగి ప్రవేశించనుండటం ఐసీసీకి కీలక పరిణామం. వందేళ్లకు పైగా విరామం తర్వాత ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు అవకాశం లభించడం ఈ క్రీడకు ప్రపంచవ్యాప్తంగా కొత్త అభిమానులను సంపాదించిపెట్టే అవకాశంగా భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఒలింపిక్స్‌లో క్రికెట్ పోటీలను విజయవంతంగా నిర్వహించడం, కొత్త దేశాలకు ఈ ఆటను విస్తరించడం, యువతను క్రికెట్ వైపు ఆకర్షించడం జై షా ముందున్న ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. అంతర్జాతీయ క్రికెట్ పోటీలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు సభ్య దేశాల మధ్య సమన్వయాన్ని పెంపొందించాల్సిన బాధ్యత కూడా ఆయనపై ఉంది.**మహిళా క్రికెట్‌కు ప్రోత్సాహం**ప్రపంచవ్యాప్తంగా మహిళా క్రికెట్‌కు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఈ విభాగానికి మరింత ప్రోత్సాహం అందించాలని ఐసీసీ నిర్ణయించింది. మహిళా క్రీడాకారిణులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే దేశాల సంఖ్యను పెంచడం, అభివృద్ధి చెందుతున్న క్రికెట్ దేశాలకు అవసరమైన సహకారం అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.అసోసియేట్ సభ్య దేశాలకు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో మరిన్ని అవకాశాలు కల్పించడం కూడా ఐసీసీ దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా ఉంది. క్రికెట్‌ను కొన్ని దేశాలకే పరిమితం చేయకుండా ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనే లక్ష్యంతో కొత్త కార్యక్రమాలను చేపట్టనున్నారు.**సభ్య దేశాల విశ్వాసం.. జై షా కృతజ్ఞతలు**రెండోసారి ఐసీసీ ఛైర్మన్‌గా ఎన్నిక కావడంపై జై షా హర్షం వ్యక్తం చేశారు. తనపై విశ్వాసం ఉంచిన ఐసీసీ బోర్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ క్రికెట్ అభివృద్ధికి సభ్య దేశాలతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు. అభిమానులు, క్రీడాకారులు, వాణిజ్య భాగస్వాములు, ఇతర భాగస్వాముల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని క్రికెట్ భవిష్యత్తును మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని వెల్లడించారు.లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం కొత్త తరానికి ఈ ఆటను పరిచయం చేసే గొప్ప అవకాశమని ఆయన అభిప్రాయపడ్డారు. కేవలం అంతర్జాతీయ టోర్నమెంట్ల నిర్వహణకే పరిమితం కాకుండా, క్రికెట్‌కు స్థిరమైన భవిష్యత్తును నిర్మించాల్సిన బాధ్యత ఐసీసీపై ఉందన్నారు.ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ రిచర్డ్ థాంప్సన్ కూడా జై షా పునర్నియామకంపై అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్‌ను బలోపేతం చేయడంతో పాటు ద్వైపాక్షిక సిరీస్‌ల ప్రాధాన్యతను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జింబాబ్వే క్రికెట్ ఛైర్మన్, ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ టావెంగ్వా ముకుహ్లానీ సైతం ఆయన నాయకత్వాన్ని స్వాగతించారు.**ప్రపంచ క్రికెట్‌కు కీలక దశ**ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ద్వైపాక్షిక సిరీస్‌లు, ప్రపంచకప్‌లు, ఫ్రాంచైజీ లీగ్‌ల మధ్య సమతుల్యత సాధించడం, క్రీడాకారుల ప్రయోజనాలను కాపాడటం, చిన్న క్రికెట్ దేశాలకు ఆర్థికంగా అండగా నిలవడం ఐసీసీ ముందున్న ప్రధాన సవాళ్లు. వాణిజ్యపరమైన అభివృద్ధితో పాటు ఆటలో సంప్రదాయ విలువలను కాపాడటం కూడా అవసరం.ఈ నేపథ్యంలో జై షా రెండోసారి ఐసీసీ ఛైర్మన్‌గా ఎన్నిక కావడం ప్రపంచ క్రికెట్ పరిపాలనలో కీలక పరిణామంగా నిలిచింది.

అర్ష్‌దీప్ విజయాల వెనుక సమ్రీన్ ప్రోత్సాహం!



- కాబోయే భార్య సహకారంతోనే మానసిక ధైర్యం.. ఆసక్తికర విషయాలు వెల్లడించిన భారత పేసర్

స్పోర్ట్స్ డెస్క్: భారత యువ క్రికెటర్, పేసర్ అర్ష్‌దీప్ సింగ్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. క్రికెట్‌లో తన ప్రదర్శన మెరుగుపడటానికి కాబోయే భార్య సమ్రీన్ కౌర్ అందిస్తున్న ప్రోత్సాహం, సహకారం ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపాడు. మైదానంలో ఒత్తిడిని ఎదుర్కొనే సమయంలో ప్రశాంతంగా ఉండటం, సరైన నిర్ణయాలు తీసుకోవడంలో ఆమె మాటలు తనకు ఎంతో ధైర్యాన్ని ఇస్తాయని పేర్కొన్నాడు.క్రికెట్‌లో విజయాలు సాధించాలంటే శారీరక సామర్థ్యంతో పాటు మానసిక స్థైర్యం కూడా అవసరమని అర్ష్‌దీప్ అభిప్రాయపడ్డాడు. మ్యాచ్‌ల సమయంలో ఎదురయ్యే ఒత్తిడి, వైఫల్యాలను అధిగమించేందుకు కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మద్దతు కీలకమని తెలిపాడు. సమ్రీన్ తనకు ఎప్పుడూ అండగా ఉంటూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగేందుకు ప్రోత్సహిస్తుందని వివరించాడు.**ప్రేమను వ్యక్తం చేసిన అర్ష్‌దీప్**గత నవంబర్ 11న న్యూజిలాండ్ పర్యటన సందర్భంగా అర్ష్‌దీప్ సింగ్ సమ్రీన్ కౌర్‌కు ప్రేమప్రతిపాదన చేశాడు. ఈ సందర్భంగా వారిద్దరి ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అప్పటి నుంచి ఈ జంటకు సంబంధించిన విషయాలపై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. తాజాగా సమ్రీన్ గురించి అర్ష్‌దీప్ చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.**మైదానంలోనూ సత్తా చాటిన పేసర్**న్యూజిలాండ్‌తో జరిగిన చివరి వన్డేలో అర్ష్‌దీప్ సింగ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 30 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. వ్యక్తిగత జీవితంలో సమ్రీన్ ప్రోత్సాహం, మైదానంలో తన కష్టపడి ఆడే తత్వం తనకు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇస్తున్నాయని అతడి వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది.



ఘనంగా తేజ సజ్జా నిశ్చితార్థం..
తరలివచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు

'హనుమాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో తేజ సజ్జా ఓ ఇంటివాడు కాబోతున్నారు. ఆయన తన బ్యాచిలర్ జీవితానికి ముగింపు పలుకుతూ పెళ్లి పీటలెక్కేందుకు సిద్ధమయ్యారు. నేడు హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య తేజ నిశ్చితార్థ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు మెగాస్టార్ చిరంజీవి, రవితేజ, నాని, రానా, రాఘవేంద్రరావు, ప్రశాంత్ వర్మ తదితరులు హాజరయ్యారు. ప్రస్తుతం ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



వచ్చే డిసెంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తేజ వివాహం జరగనుంది. ఈ పెళ్లి వేడుకను కేవలం కుటుంబ సభ్యుల సమక్షంలోనే ప్రైవేట్‌గా నిర్వహించనున్నారు. అనంతరం హైదరాబాద్‌లో స్నేహితులు, సినీ ప్రముఖుల కోసం గ్రాండ్‌గా రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. కాగా, తేజ వివాహం చేసుకోబోయే అమ్మాయి వివరాలను గోప్యంగా ఉంచారు. ఆమె అమెరికాలో పెరిగారని, ఐటీ రంగంలో వ్యాపారం చేస్తున్నారని తెలుస్తోంది. ఇది పెద్దలు కుదిర్చిన వివాహం అని సమాచారం.ఇక సినిమాల విషయానికొస్తే, 'హనుమాన్', 'మిరాయ్' వంటి విజయాల తర్వాత తేజ పలు క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆయన గతంలో నటించిన 'జాంబిరెడ్డి' సినిమాకు సీక్వెల్‌తో పాటు 'హనుమాన్' సీక్వెల్‌లోనూ నటించనున్నారు.

'వారణాసి' షూటింగ్ పూర్తి..
అసలైన బ్లాస్ట్ ముందుందంటూ జక్కన్న టీమ్ సస్పెన్స్!

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్, ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న 'వారణాసి'. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' చిత్రాలతో ప్రపంచ వేదికపై తెలుగు సినిమా సత్తాను చాటిన రాజమౌళి తదుపరి చిత్రం కావడంతో దీనిపై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. ఈ నేపథ్యంలో చిత్ర బృందం తాజాగా ఒక కీలకమైన అప్‌డేట్‌తో పాటు అభిమానుల్లో మరింత ఉత్కంఠను రేకెత్తించే ఒక హింట్ ఇచ్చింది.

'వారణాసి' చిత్రం షూటింగ్ మొత్తం పూర్తయినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సినిమా అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో ఒక పోస్ట్ చేసింది. ప్రస్తుతం సినిమా కీలకమైన పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉందని, విజువల్ ఎఫెక్ట్స్ పనులతో పాటు రీ-రికార్డింగ్ కూడా జరుగుతోందని స్పష్టం చేసింది. త్వరలోనే డబ్బింగ్ పనులు ప్రారంభం కానున్నాయని తెలిపింది. సరిగ్గా ఏడాది క్రితం అత్యంత వైభవంగా జరిగిన ఈ సినిమా అనౌన్స్‌మెంట్ ఈవెంట్ ఎంతటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఇప్పుడు షూటింగ్ పూర్తికావడంతో సినిమా నిర్మాణంలో మరో ముఖ్యమైన ఘట్టం ముగిసినట్లయింది.

అయితే, ఈ అప్‌డేట్‌లో అసలైన కిక్ చివర్లో ఉంది. "ఇది అప్‌డేట్ అనుకుంటే అప్‌డేట్. కానీ, అసలైన బ్లాస్ట్ కోసం మరికొంత కాలం వేచి ఉండండి" అన్నట్లుగా చిత్ర బృందం తన పోస్ట్‌లో పేర్కొంది. ఈ ఒక్క వ్యాఖ్యతో అభిమానుల్లో, సినీ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. ఇంతకీ రాజమౌళి ప్లాన్ చేస్తున్న ఆ 'బ్లాస్ట్' ఏంటి? సినిమాకు సంబంధించిన గ్లింప్స్ లేదా మేకింగ్ వీడియో విడుదల చేస్తారా? లేక మహేశ్ బాబు పాత్రకు సంబంధించిన లుక్ రివీల్ చేస్తారా? అంటూ సోషల్ మీడియాలో ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.ఈ చిన్న హింట్‌తోనే సినిమాపై అంచనాలు మరో స్థాయికి చేరాయి. ఏది ఏమైనా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండటంతో సినిమా అనుకున్న సమయానికే ప్రేక్షకుల ముందుకు రావడం ఖాయంగా కనిపిస్తోంది. ముందుగా ప్రకటించినట్లుగా 'వారణాసి' చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ గ్లోబల్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో మహేశ్ బాబును రాజమౌళి ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.



'ఆకాశంలో ఒక తార' ట్రైలర్
: అమ్మాయి స్పేస్ డ్రీమ్ వెనుక దుల్కర్!

తెలుగులో ఎప్పుడూ డిఫరెంట్ కథలను ఎంచుకునే దుల్కర్ సల్మాన్, మరోసారి ఒక ఫ్రెష్ కాన్సెప్ట్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. పవన్ సాధినేని దర్శకత్వంలో నటించిన లేటెస్ట్ మూవీ 'ఆకాశంలో ఒక తార'. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మించిన ఈ సినిమా ట్రైలర్ రిలీజైంది. కమర్షియల్ హంగుల జోలికి వెళ్లకుండా, ఒక ఎమోషనల్ డ్రామాను తెరపైకి తెస్తున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. అబ్దుల్ కలాం కొటేషన్ తో మొదలైన ట్రైలర్, గోదావరి పల్లెటూరి బ్యాక్ డ్రాప్ లో సాగే ఒక సింపుల్ కథను పరిచయం చేసింది. ఇందులో కల్పన పాత్రలో సాత్విక వీరవల్లి కనిపిస్తున్నారు. ఇంగ్లీష్ కూడా సరిగ్గా రాని ఒక సాధారణ అమ్మాయి, ఆస్ట్రోనాట్ అయి స్పేస్ లోకి వెళ్లాలని పెద్ద కల కంటుంది. చుట్టుపక్కల వాళ్లంతా ఆమె ఆశను చూసి నవ్వుతున్నా, కృష్ణ పాత్రలో దుల్కర్ సల్మాన్ ఆమెకు సపోర్ట్ గా నిలుస్తారు. తన కల కోసం తానే కాలిలా మారి నడిపించాలనుకునే పల్లెటూరి కుర్రాడిగా దుల్కర్ లుక్, బాడీ లాంగ్వేజ్ నేచురల్ గా ఉన్నాయి. ూశ్రీంశీ =ష్ఱ – ఇప్పుడు వదలకపోతే.. పెళ్లి జరగదు.. నన్ను వదిలేయండి ప్లీజ్! ట్రైలర్ లో డైలాగ్స్ కంటెంట్ కు తగ్గట్లు సింపుల్ గా, ఎమోషనల్ గా కుదిరాయి. "పది మంది నవ్వితే ఏంటి.. ఒక్కళ్లు నమ్మితే చాలదా కృష్ణ గారూ" అని హీరోయిన్ చెప్పే డైలాగ్ తో పాటు, చివర్లో కారులో దుల్కర్ ఎమోషనల్ అవుతూ "రేపు నువ్వు నన్ను వదిలి వేల కిలోమీటర్లు వెళ్తావ్.. అలవాటు చేసుకో" అని చెప్పే సీన్ టచ్ చేసేలా ఉంది. గ్రామీణ వాతావరణం నుంచి డీఆర్డీవో, ప్రైవేట్ స్పేస్ మిషన్ వరకు కథ మారే తీరును నీట్ గా కట్ చేశారు.ఈ ట్రైలర్ లో శ్రుతి హాసన్ రోల్ సర్ ప్రైజ్ ట్విస్ట్ లా కనిపిస్తోంది. రాకెట్ ప్రయోగాలు చేసే ఒక బోల్డ్ స్పేస్ సైంటిస్ట్ గా, సిగరెట్ తాగుతూ కాస్త రఫ్ యాటిట్యూడ్ ఉన్న 'రోహిణి' పాత్రలో శ్రుతి కొత్తగా కనిపించారు. కల్పన టాలెంట్ ను గుర్తించి తన టీమ్ లోకి తీసుకునే కీలక పాత్రలో ఆమె నటించారు. ఇక ట్రైలర్ ఎండింగ్ లో రుహాని శర్మ ఎంట్రీ ప్లెజెంట్ గా ఉంది. "ఆప్ దోనో కా కహానీ బహుత్ ప్యారా హై" అంటూ ఆమె చెప్పిన డైలాగ్ తో ట్రైలర్ ను కూల్ గా ముగించారుటెక్నికల్ వర్క్ కూడా సినిమాకు బాగానే సెట్ అయినట్లు కనిపిస్తోంది. సుజిత్ సారంగ్ కెమెరా వర్క్ ఒకవైపు గోదావరి విలేజ్ విజువల్స్ ను, మరోవైపు స్పేస్ సెటప్ ను రిచ్ గా చూపించింది. జీవీ ప్రకాష్ కుమార్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సన్నివేశాల్లోని ఎమోషన్ ను బాగా క్యారీ చేసింది. గుణ్ణం గంగరాజు రైటింగ్, ప్రవీణ్ కెఎల్ ఎడిటింగ్ సినిమాకు ప్లస్ అయ్యేలా ఉన్నాయి. రొటీన్ ఫార్ములా సినిమాలకు భిన్నంగా ఒక ఇన్‌స్పైరింగ్ డ్రామాగా 'ఆకాశంలో ఒక తార' రూపొందినట్లు ట్రైలర్ క్లారిటీ ఇస్తోంది. ఎక్కడా ఓవర్ డ్రామా లేకుండా, కంటెంట్ మీద నమ్మకంతో తీసిన సినిమా లాగా అనిపిస్తోంది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, హిందీ భాషల్లో నవంబర్ 20న ఈ మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది. మరి ఈ పల్లెటూరి అమ్మాయి స్పేస్ జర్నీ ఆడియన్స్ కు ఏ రేంజ్ లో కనెక్ట్ అవుతుందో చూడాలి.



సంగీత దర్శకుడిగా 15 ఏళ్లు.. అనిరుధ్ భావోద్వేగ సందేశం



సంగీత దర్శకుడిగా 15 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. ఇన్నేళ్ల ప్రయాణంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు, విజయాలు సొంతమయ్యాయని పేర్కొంటూ.. ఇంకా సాధించాల్సిన కలలు ఎన్నో ఉన్నాయని, తన అత్యుత్తమ సంగీతం ముందుందని వెల్లడించారు.15 ఏళ్ల క్రితం ఇదే రోజున తమ తొలి పాట ప్రేక్షకుల ముందుకు వచ్చిందని అనిరుధ్ గుర్తుచేసుకున్నారు. అప్పటి నుంచి ఆగకుండా సాగుతున్న ప్రయాణంలో సంగీతం, జ్ఞాపకాలు, అద్భుతమైన అనుభవాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. తమిళం, తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో పాటలు రూపొందించే అవకాశం దక్కిందని చెప్పారు. స్వతంత్ర సంగీతం, అంతర్జాతీయ కళాకారులతో కలసి పనిచేయడం, వివిధ భాషల్లో పాటలు పాడటం తన ప్రయాణంలో ప్రత్యేక అనుభవాలని పేర్కొన్నారు.

దేశంలోని ప్రముఖ దర్శకులు, నటులు, నిర్మాతలతో కలిసి పనిచేసే అవకాశం లభించిందని అనిరుధ్ తెలిపారు. స్ట్రీమింగ్ రికార్డులు సృష్టించడం, కోట్లాది మంది శ్రోతలకు చేరువ కావడం, ప్రపంచవ్యాప్తంగా సంగీత కచేరీలు నిర్వహించడం మరచిపోలేని అనుభవాలని చెప్పారు. చార్ట్‌బస్టర్ పాటల నుంచి వేలాది మంది అభిమానులు తమ పాటలను గొంతెత్తి పాడటం వరకు ప్రతి సందర్భం ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నారు.ఈ ఏడాది తనకు మరింత ప్రత్యేకమని అనిరుధ్ వెల్లడించారు. 2026లో ఆయన సంగీతం అందించిన ఐదు సినిమాలు 'ూ×ఖ', 'జననాయగన్', 'ణజ', 'పారడైజ్', 'జైలర్ 2' ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. వీటిలోని పలు పాటలు ఇప్పటికే హిట్‌లుగా నిలిచాయి. 15 ఏళ్ల సంగీత ప్రస్థానానికి ఇంతకంటే మంచి వేడుక ఉండదని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.ఎత్తుపల్లాలు, సవాళ్లు ఎదురైనా ఒక్కరోజు కూడా విరామం తీసుకోకుండా పనిచేశామని అనిరుధ్ చెప్పారు. సంగీతంపై మొదటిరోజు ఉన్న ప్రేమే ఇప్పటికీ తమను ముందుకు నడిపిస్తోందన్నారు. ఇటీవలే కావ్య మారన్‌ను వివాహం చేసుకున్న అనిరుధ్.. అభిమానులు, శ్రోతలు తన పాటలను మళ్లీ మళ్లీ వింటూ, పాడుతూ, ఆదరిస్తూ అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. 15 ఏళ్ల ప్రయాణం ముగిసినా, ఇంకా లక్షలాది కలలు సాకారం చేసుకోవాల్సి ఉందని, మళ్లీ స్టూడియోలోకి అడుగుపెడుతున్నానని పేర్కొన్నారు.

గడ్డకట్టే నీటిలో 6 గంటలు..
'మాతృభూమి' సినిమా కోసం సల్మాన్ కష్టాన్ని వెల్లడించిన దర్శకుడు

బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ తన సినిమా కోసం ఎంతటి కష్టానికైనా సిద్ధపడతారని మరోసారి నిరూపించారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'మాతృభూమి: మే వార్ రెస్ట్ ఇన్ పీస్' షూటింగ్‌లో భాగంగా గడ్డకట్టే చల్లని నీటిలో రోజుకు ఆరు గంటల పాటు గడిపారని దర్శకుడు అపూర్వ లఖియా వెల్లడించారు. తడిసిన దుస్తులతోనే భోజనం చేస్తూ చిత్రీకరణలో పాల్గొన్నారని తెలిపారు.ఈ సినిమా కోసం తొలుత ముంబైలోని స్టూడియోలో ఓ కీలక సన్నివేశాన్ని చిత్రీకరించాలని భావించారట. అయితే సహజత్వం కోసం సెట్‌లో కాకుండా నిజమైన ప్రదేశంలోనే షూట్ చేయాలని సల్మాన్ సూచించడంతో సెప్టెంబర్ చివర్లో చల్లని నీటిలో చిత్రీకరణ జరిపినట్లు దర్శకుడు చెప్పారు. ఆ నీటి ఉష్ణోగ్రత దాదాపు సున్నా డిగ్రీలకు దగ్గరగా ఉందని వివరించారు. సల్మాన్‌తో పాటు ఇతర నటులు చలికి వణికిపోవడం నటన కాదని, నిజంగానే అంతటి చలిని భరించారని పేర్కొన్నారు.ఈ సన్నివేశాన్ని ఒక్కరోజులో పూర్తి చేయాలనుకున్నా.. రెండున్నర రోజులు పట్టిందని అపూర్వ తెలిపారు. నటీనటులు ఎదుర్కొన్న కష్టాన్ని చూసిన సిబ్బంది, తామే ఆ సీన్ చేస్తున్నంత ఇదిగా చలికి వణికిపోయారని చెప్పారు.సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జియో స్టూడియోస్ ఆల్ ఇండియా పంపిణీ బాధ్యతలు చేపట్టగా, విదేశీ పంపిణీని జీ స్టూడియోస్ నిర్వహిస్తోంది. 2026 డిసెంబర్ 4న ఈ సినిమా విడుదల కానుంది.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613